ప్రజాశక్తి

శనివారం 5 ఆగస్టు 2023

8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

పెన్షనర్ల ఆరోగ్య హక్కుపై దాడి

◆ సిజిహెచ్ఎస్ షెడ్లపై జివిఎంసి ప్రతాపం

◆ కూల్చివేతతో చికిత్స అందక దిక్కుతోచని వేల మంది వృద్ధులు ◆ చోద్యం చూస్తున్న కేంద్రం

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

వారంతా విశ్రాంత ఉద్యోగులు, పోరాడటానికి సత్తువ లేనివారని భావించేమో మహా విశాఖ నగర పాలక సంస్థ (జివిఎంసి) అధికారులు ప్రతాపం చూపారు. గత నెల 25న నగరంలోని చినవాల్తేరు ఆసుపత్రి ప్రాంగణంలోగల సెంట్రల్ గవర్నమెంట్ హెల్త్ స్కీం (సిజిహెచ్ఎస్) పెన్షనర్ల ఆసుపత్రి షెడ్లను 12 అడుగుల వరకూ కూల్చేశారు. దీంతో నేడు వైద్యం అందక పెన్షనర్లంతా అగమ్యగోచర స్థితిలో పడ్డారు. జివిఎంసి నెల రోజుల క్రితమే తమ రహదారి విస్తరణ కోసం సిజిహెచ్ఎస్ షెడ్లను తీసేయాల్సి వస్తుందని నోటీసు ఇచ్చినా.. ఆ సమాచారం హైదరాబాద్ కేంద్ర కార్యాలయంలోని అడిషనల్ డైరెక్టర్‌కు మెంటల్ కేర్ ఆసుపత్రి సూపరింటెండెంట్ తెలియజేసినా.. పై నుంచి ఎలాంటి స్పందనా రాలేదు. కేంద్రంలోని బిజెపి సర్కారుకు కేంద్ర ప్రభుత్వ పెన్షనర్లపై ఎంత శ్రద్ధ ఉందో ఈ విషయంలో ఇట్టే అర్థమవుతుంది. ముఖ్యంగా ఎపి విభజన హామీల్లో భాగంగా విశాఖ కేంద్రంగా సిజిహెచ్ఎస్‌కు అడిషనల్ డైరెక్టర్ పోస్టును కేటాయించాల్సి ఉన్నా మిగతా 2లో..



జివిఎంసి అధికారులు కూల్చిన సిజిహెచ్ఎస్ షెడ్లు

మాకేమీ వైద్యం భిక్ష కాదు..నెలకి వెయ్యి చెల్లిస్తున్నాం



వైద్యాన్ని కేంద్ర ప్రభుత్వం మాకేమీ ఉచితంగా అందించడం లేదు. నెలకు 30 వేల కార్డుల ద్వారా రూ.లక్షలు కడుతున్నాం. పెన్షనర్ ఒక్కొక్కరూ నెలకు రూ.వెయ్యి చెల్లిస్తున్నారు. ఇచ్ఛాపురం నుంచి వైజాగ్ వరకూ సిజిహెచ్ఎస్ ఎక్కడా లేదు. తుని, రాజమండ్రి నుంచీ వస్తున్నారు. వెల్‌నెస్ సెంటర్లు పెంచాల్సింది పోయి దీన్ని కూలగొట్టే వరకూ కేంద్రం చోద్యం చూడడం సరైంది కాదు.

జివిఎస్ఎన్ మూర్తి, సిజిహెచ్ఎస్ ఆల్ సెంట్రల్ గవర్నమెంట్ ఎంప్లాయీస్ పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు

సచివాలయాల్లో ఖాళీలు

◆ భర్తీచేయని ప్రభుత్వం

◆ ఉద్యోగులపై పెరుగుతున్న పనిభారం

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

జిల్లాలోని గ్రామ, వార్డు సచివాలయాల్లో ఖాళీలు పెరుగుతున్నాయి. దీంతో ప్రస్తుత ఉద్యోగులపై పనిభారం పెరుగుతోంది. 2020 తరువాత వివిధ శాఖల్లోని పోస్టులను భర్తీ చేయకపోవడంతో ఆ ఖాళీలు సంఖ్య 800కు చేరింది. నియామకాలు జరిగిన తరువాత కొంతమంది ఉద్యోగులు రాజీనామా చేసి ఇతర ఉద్యోగాల్లో చేరారు. కొద్దిమంది ఒత్తిళ్లు, ఇతర కారణాలతో మానేశారు. ఈ నేపథ్యంలో ఉన్నవారిపై పనిభారం పడుతోంది.



పని ఒత్తిడిపై ఇటీవల ఆందోళనకు దిగిన ఉద్యోగులు (ఫైల్)

జిల్లాలోని గ్రామ సచివాలయాలు 465, వార్డు సచివాలయాలు 57 వెరసి 522 వున్నాయి. వీటిలో దాదాపు నాలుగు వేల మందికి పైగా ఉద్యోగులు పనిచేస్తున్నారు. 2020 తరువాత సచివాలయ ఉద్యోగుల భర్తీకి నోటిఫికేషన్‌ను ప్రభుత్వం విడుదల చేయలేదు. దీంతో ఖాళీలు అలాగే ఉన్నాయి. అత్యధికంగా విలేజ్ వెటర్నరీ అసిస్టెంట్ పోస్టులు 217, హార్టికల్చర్ అసిస్టెంట్ పోస్టులు 139 వున్నాయి. ఈ రెండింటికీ విద్యార్హతలు కలిగిన అభ్యర్థులు లేకపోవడంతో గతంలో భర్తీ కాలేదు. దీంతో ఈ పోస్టుల ఖాళీలు ఎక్కువగా వున్నాయి. సచివాలయాల్లో ఆయా శాఖల ఖాళీలు భర్తీచేయకపోవడంతో ఇతర ఉద్యోగులకు ఆ పనులు అప్పగిస్తున్నారు.

ఇవీ ఖాళీలు

పంచాయతీ సెక్రటరీ గ్రేడ్ - 6 (డిజిటల్ అసిస్టెంట్స్) 54, వెల్ఫేర్, ఎడ్యుకేషన్ అసిస్టెంట్స్ 68, విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్స్ 25, విలేజ్ హార్టికల్చర్ అసిస్టెంట్స్ 139, ఫిషరీస్ అసిస్టెంట్స్ 3, వెటర్నరీ అసిస్టెంట్స్ 217, గ్రేడ్-2 ఇంజినీరింగ్ అసిస్టెంట్స్ 73, విలేజ్, వార్డు రెవెన్యూ అధికారులు 66, గ్రేడ్-3 విలేజ్ సర్వేయర్ అసిస్టెంట్స్ 31, సెరీకల్చర్ అసిస్టెంట్స్ 2, గ్రేడ్-2 వార్డు శానిటేషన్, ఎన్విరాన్‌మెంట్ కార్యదర్శులు 2, గ్రేడ్ -2 వార్డు మిగతా 2లో..

బకాయి జీతాలు చెల్లించాలని పంచాయతీ కార్మికుల ధర్నా

▶ వార్త 5లో..

అభివృద్ధి పనులు మరింత వేగవంతం

▶ వార్త 5లో..

కానిస్టేబుల్‌ది ముమ్మాటికీ హత్యే

▶ వార్త 2లో..



మాట్లాడుతున్న డిఆర్ఎం సౌరభ్ ప్రసాద్

6 నుంచి అమృత్ భారత్ స్టేషన్ల ఆధునికీకరణ

దువ్వాడ స్టేషన్‌కు రూ.26 కోట్లు కేటాయింపు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : అమృత్ భారత్ స్టేషన్ల పథకంలో భాగంగా గుర్తించిన రైల్వే స్టేషన్ల ఆధునికీకరణ పనులకు ప్రధాని నరేంద్ర మోడీ ఈ నెల 6న వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేస్తారని వాల్తేర్ డిఆర్ఎం సౌరభ్ ప్రసాద్ తెలిపారు. శుక్రవారం సాయంత్రం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ అమృత్ భారత్ స్టేషన్ల పథకంలో భాగంగా మిగతా 2లో..

మణిపూర్ అకృత్యాలపై నిరసనలు

మణిపూర్‌లో బిజెపి పాలనలో సాగుతున్న అకృత్యాలను ఖండిస్తూ విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో శుక్రవారం నిరసనలు చేపట్టారు. విశాఖ నగరంలోని దుర్గాలమ్మ గుడి సెంటర్‌లో పెద్ద సంఖ్యలో మహిళలు కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు.

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్

మణిపూర్‌లో మహిళలను వివస్త్రలను చేసి ఊరేగించడం, వారికి పోలీసులు సహకరించడం హృదయాన్ని కలిచి వేసిందని ఐద్వా నాయకులు ఆర్.వరలక్ష్మి అన్నారు. మణిపూర్ అకృత్యాలను ఖండిస్తూ సిఐటియు, ఐద్వా ఆధ్వర్యంలో ఎం.సుబ్బారావు అధ్యక్షతన పూర్ణా మార్కెట్ దుర్గాలమ్మ గుడి వద్ద కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బిజెపి హయాంలో మహిళలు, దళితులు, మైనార్టీలపైన దాడులు విపరీతంగా పెరిగాయన్నారు. అటువంటి దమనకాండను ఆపాలని లేకపోతే ప్రజలందరూ తిరగబడి బిజెపి మతోన్మాదాన్ని బంగాళాఖాతంలో కలుపుతారని హెచ్చరించారు. మత్స్యకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కె.చంద్రశేఖర్, సిఐటియు సీనియర్ నాయకులు వై.రాజు మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో బిజెపికి సహకరించే పార్టీలను ఓడించాలని పిలుపునిచ్చారు. సిఐటియు జోన్ కార్యదర్శి చంద్రమౌళి మాట్లాడుతూ మణిపూర్ అల్లర్లకు బిజెపి ఆజ్యం పోస్తోందన్నారు. కార్యక్రమంలో ఐద్వా నాయకులు ఎం.అన్నపూర్ణ, పార్వతి మిగతా 2లో..



కె.కోటపాడులో నిరసన ర్యాలీ చేపడుతున్న నాయకులు



పూర్ణామార్కెట్ వద్ద కొవ్వొత్తుల ప్రదర్శన చేపట్టిన మహిళలు

మొదటి పేజీ తరువాయి..

పెన్షనర్ల ఆరోగ్య హక్కుపై దాడి

బిజెపి సర్కారు ఆ పనిచేయలేదు. పెన్షనర్లంతా ఈ విషయంపై నెలల తరబడి గగ్గోలు పెడుతున్నారు. హైదరాబాద్ నుంచే ఒక డైరెక్టర్ 16 వెల్‌నెస్ సెంటర్లను చూస్తున్నారు. ఎపి వ్యవహారాలనూ అక్కడి నుంచే చూడాలి. కానీ కన్నెత్తి కూడా ఆ అధికారి చూడడం లేదు. ఆంధ్రప్రదేశ్‌కు.. ముఖ్యంగా విశాఖకు కేంద్రంలోని మోడీ సర్కారు చేసిన ద్రోహాల్లో ఇది కూడా ఒకటి. కేంద్ర ప్రభుత్వ రంగ ఉద్యోగుల బాధలు తీర్చడానికే విశాఖపట్నానికి వచ్చానంటూ నిత్యం ప్రచారార్భాటం చేసే బిజెపి రాజ్యసభ సభ్యులు జివిఎల్. నరసింహారావు సైతం పెన్షనర్ల సిజిహెచ్‌ఎస్‌కు అధికారిని కేటాయించి, సరైన స్థలంలో ఏర్పాటు చేయడానికి ఎలాంటి కృషి చేయలేదు.

విశాఖలోనే 30 వేల హెల్త్ కార్డులు

ఇచ్ఛాపురం నుంచి రాజమండ్రి వరకూ విశాఖపట్నం కేంద్రంగా నడిచిన సిజిహెచ్‌ఎస్ ఆసుపత్రిలో 30 వేల కార్డులు పెన్షనర్లవి ఉన్నాయి. వీటిలో 90 శాతం విశాఖకు చెందిన సెంట్రల్ గవర్నమెంట్ రిటైర్డ్ ఉద్యోగులవే. చినవాల్తేరు వద్దనున్న షెడ్లలో సిజిహెచ్‌ఎస్ నడిచేది. జివిఎంసి అధికారుల పుణ్యమా అంటూ...వారి రోడ్డు విస్తరణ కోసం 12 అడుగుల స్థలంలోని ఈ ఆసుపత్రి షెడ్లను పడగొట్టేశారు. ఇదిలా ఉండగా సిజిహెచ్‌ఎస్ మరో వెల్‌నెస్ సెంటర్ డాబాగార్డెన్స్‌లో ఉంది. 30 వేల కార్డులకు మూడు వెల్‌నెస్ సెంటర్లు విశాఖలో ఉండాలన్న పెన్షనర్ల డిమాండ్‌ను కేంద్ర ప్రభుత్వం పట్టించుకోలేదు సరికదా ఉన్నటువంటి ముఖ్యమైన ఆసుపత్రి ప్రాంగణాన్ని కూడా పడగొట్టేవరకూ వేచిచూడడంతో వృద్ధులు నేడు తీవ్ర ఆవేదనకు గురౌతున్నారు. డాబాగార్డెన్స్ వెల్‌నెస్ సెంటర్‌లో చికిత్స కోసం వెళితే అధిక సంఖ్యలో రోగులు ఉండడంతో అష్టకష్టాలు పడాల్సి వస్తోందని, మందుల్లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని అప్పలస్వామి అనే పెన్షనర్ తీవ్ర బాధను వ్యక్తం చేశారు. ఆలిండియా రేడియో కేంద్రం విశాఖలో ఖాళీగా ఉందని, అక్కడ నడుపుకోవచ్చని స్టేషన్ డైరెక్టర్ తమను ఆహ్వానించినా కేంద్రం నుంచి క్లియరెన్స్ రాలేదంటూ పెన్షనర్లు తాజాగా మొరపెట్టుకుంటున్నారు.

మణిపూర్ అకృత్యాలపై నిరసనలు

పాల్గొన్నారు. వై.రాజు తయారుచేసిన కళాఖండాలు పలువురిలో చైతన్యం నింపాయి.

కె.కోటపాడు : మణిపూర్ రాష్ట్రంలో మూడు నెలలుగా జరుగుతున్న నరమేధానికి నిరసనగా సిపిఎం ఆధ్వర్యాన శుక్రవారం మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ నాయకులు ఎర్రా దేముడు, గాడి ప్రసాద్ మాట్లాడుతూ ఈ నరమేధానికి కారణమైన కేంద్రంలో బిజెపి ప్రభుత్వాన్ని తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. మణిపూర్‌లో గిరిజన కుకీ తెగకు చెందిన మహిళలపై మతోన్మాదులు అత్యాచారాలు, దౌర్జన్యాలు చేస్తున్నప్పటికీ పోలీసులు చూసీ చూడనట్లుగా వ్యవహరించారని విమర్శించారు. ఆ రాష్ట్రంలో మహిళలపై జరుగుతున్న అరాచకాలు, మానభంగాలు దౌర్జన్యాలపై ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పెదవి విప్పకపోవడం దుర్మార్గమన్నారు. బిజెపి ప్రభుత్వమే మతోన్మాదులను రెచ్చగొట్టి అమాయకులైన గిరిజన మహిళపై దాడులు, అత్యాచారాలు చేయించిందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం సానుభూతిపరులు పాల్గొన్నారు.

6 నుంచి అమృత్ భారత్ స్టేషన్ల ఆధునికీకరణ

వాల్తేర్ డివిజన్‌లోని 15 స్టేషన్లను గుర్తించారని తెలిపారు. మొదటి విడతగా దువ్వాడ రైల్వే స్టేషన్‌ను రూ.26.31 కోట్లతో, విజయనగరం స్టేషన్‌ను రూ.35.76 కోట్లతో, దమన్‌జోడి స్టేషన్‌ను రూ.13.93 కోట్లతో అభివృద్ధి చేయనున్నట్టు వెల్లడించారు. ఈ పథకంలో భాగంగా ఆంధ్రప్రదేశ్‌లోని 10, ఒడిశాలోని 4, ఛత్తీస్‌గఢ్‌లోని ఒక స్టేషన్‌ను ఆధునికీకరిస్తున్నట్టు తెలిపారు. ప్రయాణికులకు అన్ని సౌకర్యాలూ అత్యంత మెరుగ్గా ఆయా స్టేషన్లలో ఉంటాయన్నారు. ఇప్పటికే మాస్టర్ ప్లాన్‌లు సిద్ధం చేశామన్నారు.

సచివాలయాల్లో ఖాళీలు

ప్లానింగ్ రెగ్యులేషన్ కార్యదర్శులు 7, వార్డు ఎడ్యుకేషన్ డేటా ప్రాసెసింగ్ కార్యదర్శులు 3, గ్రేడ్-2 వెల్ఫేర్ డెవలప్‌మెంట్ కార్యదర్శి ఒకరు, వార్డు సదుపాయాల కల్పన కార్యదర్శులు రెండు, వార్డు పరిపాలన కార్యదర్శి ఒకటి, మహిళా పోలీసు, బలహీనవర్గాల సంరక్షణ కార్యదర్శులు 68, వార్డు ఎనర్జీ అసిస్టెంట్స్, కార్యదర్శులు 35, ఎఎన్ఎమ్/వార్డు హెల్త్ కార్యదర్శులు మూడు పోస్టులు ఖాళీగా వున్నాయి.

కానిస్టేబుల్‌ది హత్యే

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : అనుమానాస్పదంగా మృతిచెందిన విశాఖ వన్‌టౌన్ కానిస్టేబుల్ రమేష్ కేసును పోలీసులు ఛేదించారు. ఈ కేసు వివరాలను విశాఖ నగర పోలీస్ కమిషనర్ త్రివిక్రమ వర్మ మీడియాకు శుక్రవారం వెల్లడించారు. ఆయన కథనం మేరకు.. వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో అసిస్టెంట్ రైటర్‌గా రమేష్ (35) పనిచేస్తున్నాడు. బుధవారం తన ఇంట్లోనే అనుమానాస్పదంగా మృతిచెందాడు. అతని భార్య శివాని ప్రవర్తనపై అనుమానం రావడంతో పోలీసులు లోతుగా విచారించారు. రమేష్ ఇంటి సమీపంలో ఉన్న కారు డ్రైవర్ రామారావు, శివానిల మధ్య వివాహేతర సంబంధం ఉన్నట్టు గుర్తించారు. వారిద్దరి మధ్య సాన్నిహిత్యాన్ని రమేష్ ప్రశ్నించాడు. దీంతో ప్రియుడు రామారావు, శివాని కలిసి రమేష్ హత్యకు పథకం వేశారు. నీలా అనే వ్యక్తికి రూ.లక్ష సుపారీ కూడా చెల్లించినట్టు తెలిసింది. వారంతా కలిసి మద్యం తాగి పడుకున్న రమేష్ ముఖంపై దిండుతో అదిమి చంపేశారు. ఈ కేసులో ఎ1గా శివానిని, ఎ2గా రామారావును, ఎ3గా నీలాను చేర్చి, అరెస్టు చేసి విచారిస్తున్నట్టు పోలీస్ కమిషనర్ తెలిపారు.

'రాజుగారి కోడి పులావ్' చిత్ర బృందం సందడి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : సస్పెన్స్, సందేశం మేళవింపుతో రాజుగారి కోడి పులావ్ చిత్రం నిర్మితమైందని ప్రేక్షక దేవుళ్లు ఆదరించి తమను ప్రోత్సహించాలని సినిమా దర్శక, నిర్మాతలు శివ కోన, అనిల్ మోదుగ కోరారు. రాజు గారి కోడి పులావ్ చిత్రం శుక్రవారం విడుదల సందర్భంగా ద్వారకా నగర్‌లోని ఓ హోటల్‌లో చిత్ర బృందం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసింది. చిత్ర సహ నిర్మాత, దర్శకుడు శివ కోన మాట్లాడుతూ రాజు గారి కోడి పులావ్ చిత్రం పూర్తిగా కుటుంబ కథా చిత్రమన్నారు. సస్పెన్స్ థ్రిల్లర్‌గా కొనసాగుతూ సామాజిక సందేశం అందేలా రూపొందించామన్నారు. సినిమా మొత్తం కేరళ, కర్ణాటక రాష్ట్రాల్లోని మంచి పర్యాటక ప్రాంతాలైన అడవుల్లో నిర్మించామన్నారు. ఇది ఒక రోడ్ అడ్వెంచర్ మూవీనని తెలిపారు. చిత్ర కథానాయిక నిహాదేశ్ పాండే మాట్లాడుతూ రాజు గారి కోడి పులావ్ తినడానికే కాదు చూడటానికి కూడా చాలా టేస్టీగా వుంటుందన్నారు. ఈ సినిమాలో తాను నటించడం వల్ల గొప్ప అనుభూతి చెందానన్నారు. ఈ సినిమాలో కదా నాయకుడుగా అభిలాష్ నటించగా, అనిల్ మోదుగ, శివ కోన నిర్మాతలుగానూ, ప్రవీణ్ మణి సంగీత దర్శకుడిగానూ పనిచేశారు.



చిత్ర విశేషాలు వెల్లడిస్తున్న దర్శకుడు, నటీనటులు

జ్ఞానాపురం ఎర్రి గెడ్డ సమస్య పట్టదా ?

ప్రజాశక్తి - కలెక్టరేట్ : వర్షాకాలంలో జ్ఞానాపురం ప్రాంతాన్ని నీటి ముంపునకు గురి చేస్తున్న ఎర్రి గెడ్డ సమస్యను వైసిపి ప్రభుత్వం పరిష్కరించ లేకపోయిందని టిడిపి దక్షిణ నియోజకవర్గం ఇన్‌ఛార్జి, మాజీ ఎమ్మెల్యే గండి బాబ్జీ విమర్శించారు. సెల్ఫీ ఛాలెంజ్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం జ్ఞానాపురం ప్రాంతంలోని 41వ వార్డులో ఆయన పర్యటించి, ఆ ప్రాంత సమస్యలను ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి అధికారంలోకి వచ్చి నాలుగేళ్లు పూర్తయినా దక్షిణ నియోజకవర్గంలో ఉన్న సమస్యలు పరిష్కారంకాకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ ప్రాంతంలోని సెయింట్ పీటర్ పాఠశాలను జగన్ ప్రభుత్వం వచ్చిన తర్వాతే మూసేశారని తెలిపారు. దీంతో ఎంతో మంది విద్యార్థులు, అధ్యాపకులు నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వానికి ప్రజలు ఎన్ని అవస్థలు పడుతున్నా కనిపించడం లేదన్నారు. కార్యక్రమంలో టిడిపి వార్డు అధ్యక్షుడు ఐతి మధుబాబు, పాత్రపల్లి రాజకుమార్, ఆకుల ఆనందరావు, మహిళా అధ్యక్షురాలు అనిత, రవిబాబు, నొడగల ఆనందరావు, సన్నీ, యాదవ్, జ్యోత్స్న, కోమలి పాల్గొన్నారు.



ఎర్రి గెడ్డను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే గండి బాబ్జీ

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : సీజనల్ వ్యాధులైన డెంగీ, మలేరియాపై నగర ప్రజలు జాగ్రత్తలు పాటించాలని జివిఎంసి కమిషనర్ సిఎం సాయికాంత్ వర్మ శుక్రవారం నగర ప్రజలకు విజ్ఞప్తి చేశారు. నగరంలో విరివిగా వర్షాలు పడుతున్న దృష్ట్యా దోమలు వృద్ధి చెంది సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఎక్కువగా ఉన్నందున ప్రతి ఒక్కరూ వ్యక్తిగత జాగ్రత్తలు పాటించాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రైడే పాటించి పరిసరాలు పొడిగా ఉండేలా చూసుకోవాలన్నారు. ఇంటి పరిసరాలలో ఖాళీ సీసాలు, టైర్లు ఉంచరాదని, అలాగే పూల కుండీలు, ఫ్రిడ్జ్ వెనుక భాగంలో నీరు ఉంచదారన్నారు. ఇంటి కిటికీలకు, మరుగుదొడ్ల పైనున్న పైపులకు మెస్‌లు బిగించాలని కోరారు. సాధ్యమైనంత వరకు వదులుగా, పొడవుపాటి దుస్తులను ధరించాలని సూచించారు.

6న మూడు గ్రంథాలపై సమాలోచన

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ఎన్‌టిఆర్ శత జయంతి వేడుకల సందర్భంగా ఎన్‌టిఆర్ లిటరేచర్ సావనీర్, వెబ్‌సైట్ కమిటీ రూపొందించిన మూడు గ్రంథాలపై సమాలోచన కార్యక్రమం ఆదివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు దసపల్లా హోటల్‌లోని వేదిక హాల్‌లో ఉంటుందని టిడిపి జిల్లా అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు పాల్గొని పుస్తకాల్లో పొందుపరిచిన అంశాలపైనా, ఎన్‌టి.రామారావు పరిపాలనలో జరిగిన చారిత్రక సంఘటనలు, అభివృద్ధి, సంక్షేమంపైనా వారి అభిప్రాయాలను వెల్లడిస్తారని తెలిపారు. కార్యక్రమంలో ఎన్‌టిఆర్ తనయుడు రామకృష్ణ, ఎన్‌టిఆర్ లిటరేచర్, సావనీర్, వెబ్‌సైట్ కమిటీ చైర్మన్ టిడి.జనార్ధన్ పాల్గొంటారని పేర్కొన్నారు.

ఓర్వలేక దాడులు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : టిడిపికి ప్రజల్లో పెరుగుతున్న ఆదరణ చూసి జగన్ మోహన్ రెడ్డి ఓర్వలేకపోతున్నారని మాజీ ఎమ్మెల్యే, టిడిపి దక్షిణ నియోజకవర్గ ఇన్‌ఛార్జి గండి బాబ్జీ అన్నారు. పుంగనూరులో టిడిపి శ్రేణులపై దాడిని ఖండిస్తూ శుక్రవారం సాయంత్రం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద ప్రధాన రహదారిపై గండి బాబ్జీ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిరికిపందల్లా తమపై దాడి చేయడం సరికాదని అన్నారు. చంద్రబాబు పులివెందుల యాత్రకు విశేష స్పందన రావడంతో వైసిపి ఓర్వలేకపోతోందని అన్నారు. తమపై రౌడీయిజం చేసి దొంగ దెబ్బతీయాలని చూస్తే ప్రజలే బుద్ధి చెబుతారని హెచ్చరించారు. కార్యక్రమంలో నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పత్రికా ప్రకటన

జిల్లా కలెక్టరు వారి కార్యాలయము నందు రికార్డు రూమ్ నిమిత్తము కాంపాక్టర్లు కొరకు సీల్డు కొటేషన్లు ఆహ్వానించడమైనది. కావున, ఆసక్తి కలిగిన దుకాణదారులు / సప్లయర్స్ వివరముల కొరకు కలెక్టరు వారి కార్యాలయములో తేది: 08-08-2023 మధ్యాహ్నం 3.00 గం॥ లోపున శ్రీ జిల్లా కలెక్టరు, అనకాపల్లి వారి కార్యాలయములో జిల్లా రెవెన్యూ అధికారి వారి ఛాంబరు నందు గల బాక్సులో సీల్డు టెండరు కవర్స్ వేయవలసినదిగా కోరడమైనది.

సం/- **జిల్లా కలెక్టర్,** అనకాపల్లి.

IN THE HON'BLE COURT OF THE PRINCIPAL JUNIOR CIVIL JUDGE ANAKAPALLI
O.S.No. 18/2017

Between:
Vedula Vasudeva Rao
S/o. Late China Suryanarayana ... Plaintiff

And:
Vedula China Venkata Chainulu
S/o. Late Ardhanareeswarudu
(Died and represented by his LRS)
and three others ... Defendants

NOTICE TO THE DEFENDANTS

To
1. Smt. Vedula Bharathi
W/o. Late China Venkata Chainulu,
2. Vedula Venkata Kasi Visweswarudu
S/o. Late China Venkata Chainulu,
3. Vedula Srinivas
S/o. Late China Venkata Chainulu,
All residents of Dr. No. 12-10-3,
Vedula Vari Veedhi, Anakapalle Town & Dist

The above named plaintiff filed the above suit for a declaration that the plaintiff is the absolute owner of the plaint schedule property of about 06.25 cents of Kallam Dibbalu in Survey No.137/5 of Nagulapalli Village in Munagapaka Mandal of Anakapalle District and to grant a consequential permanent injunction restraining the defendants, their men and agents from ever interfering with his peaceful possession and enjoyment of the plaint Schedule land including its alienation in any manner etc.

Consequent on the death of the sole defendant the Hon'ble Court ordered to issue notice to the proposed defendants for including them as the defendants in the matter and accordingly the plaintiff issued the notice to all the three of you on a number of occasions. But you have not appeared in the matter so far. Hence the Hon'ble Court ordered to issue notice to you by way of paper publication in the local News Paper. So please take notice that you are hereby summoned to appear in this Court on the next date of posting i.e., 18-08-2023 at 10-30 A.M. If you fail to appear in the above said Hon'ble Court on that date, the mater will be heard in your absence and necessary orders will be passed in this matter.

(By the Order of the Hon'ble Court)
SK. SULAIMAN &
SK. MEERAVALI SHAREEF,
Advocates, Visakhapatnam
at Anakapalle Mobile Nos. 9848189301 and 9298602659.

జోరుగా రాజకీయ సమీకరణాలు!

▸▸ భీమిలి నుంచి ప్రధాన పార్టీల్లో పోటీకి ఆశావహుల ఆసక్తి

▸▸ రాజకీయంగా బలం, బలహీనతలపై సర్వత్రా చర్చ

ప్రజాశక్తి -భీమునిపట్నం : జిల్లాలోనే అతి పెద్ద అసెంబ్లీ నియోజకవర్గమైన భీమిలిలో రాజకీయ సమీకరణలు అప్పుడే ఊపందుకుంటున్నాయి. వైసిపి, టిడిపి, జనసేన ప్రధాన రాజకీయ పార్టీల్లో ఈ తంతు కాస్తంత ఎక్కువగానే ఉండి, ఆయాపార్టీల పోటీ అభ్యర్థులెవరనేది అప్పుడే ఊహాగానాలు వినిపిస్తున్నాయి.

వైసిపిలో అంతర్గత విభేదాలు

ఎన్నికలు సమీపిస్తున్న వేళ అధికార వైసిపిలో అంతర్గత విభేదాలు, మరింత బహిర్గతమయ్యే ఛాన్స్ ఉ ందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ప్రస్తుత ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు మళ్లీ వైసిపి అభ్యర్థిగానే భీమిలి నుంచి పోటీచేస్తారని స్వయంగా ఆయన వెల్లడించడంతోపాటు ఆయన అనుచరగణం ఇదే విషయాన్ని స్పష్టం చేస్తున్నారు.2009లో ఆవిర్భవించిన ప్రజారాజ్యంలో రాజకీయ ఆరంగేట్రంలోనే ఎమ్మెల్యేగా విజయం సాధించారు తర్వాత కాంగ్రెస్ గూటికి చేరినా 2014లో టిడిపిలో చేరి అనకాపల్లి ఎంపీ స్థానంలో జయకేతనం ఎగరేశారు. 2019లో వైసిపి తరపున భీమిలి ఎమ్మెల్యేగా గెలుపొందడమే కాక మంత్రి, జిల్లా అధ్యక్ష పదవులను చేపట్టి,ఎక్కడ, ఏపార్టీ తరపున పోటీచేసినా తన విజయానికి ఢోకా లేదని ఇన్నాళ్లుసత్తా చాటుతూ వచ్చారు. అధికార వైసిపిలో అంతర్గత విభేధాల నేపథ్యంలో, పార్టీ ఆవిర్భావం నుంచి వైసిపిలోనే ఉన్న ప్రస్తుత భీమిలి ఎంపిపి దంతులూరి వెంకట శివ సూర్యనారాయణరాజు (వాసురాజు), రానున్న ఎన్నికల్లో భీమిలి అసెంబ్లీ స్థానంలో వైసిపి అభ్యర్థిగా పోటీకి తనదైన శైలిలో ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. స్థానికతతోపాటు కష్టాల్లో అందరినీ ఆదుకుంటూ, తరతమ బేధం లేకుండా అందరిలోనూ కలిసిపోయే తత్వం వాసురాజుకు సానుకూలాంశాలుగా చెబుతున్నారు.

కంచుకోట కాపాడుకునేందుకు టిడిపి యత్నాలు

టిడిపి ఆవిర్భావం 1983నుంచి 1999 వరకు ఆపార్టీకి బ్రహ్మరథం పట్టిన భీమిలిలో తెలుగుదేశం పార్టీకి బలమైన కేడర్ ఉంది. 2004లో కాంగ్రెస్ అభ్యర్థి కర్రి సీతారాం, 2009లో ప్రజారాజ్యం తరపున ముత్తంశెట్టి శ్రీనివాసరావు



అతి స్వల్పతేడాతో గెలుపొందినప్పటికీ, మళ్లీ 2014 ఎన్నికల్లో టిడిపి అభ్యర్థిగా గంటా శ్రీనివాసరావు, తన సమీప ప్రత్యర్థి కాంగ్రెస్ అభ్యర్థి కర్రి సీతారాంపై ఏకంగా 37,366 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. 2019 ఎన్నికల్లో వైసిపి అభ్యర్థి ముత్తంశెట్టి శ్రీనివాసరావు విజయం సాధించినా, టిడిపికి నేటికీ ఇక్కడ మంచిపట్టు ఉంది.. 2024 ఎన్నికల్లో టిడిపి అభ్యర్థిగా ఆ పార్టీ నియోజకవర్గ ఇంఛార్జి కోరాడ రాజబాబు పోటీకి ఉత్సాహం చూపుతున్నారు. పార్టీ అధిష్ఠానం ఆశీస్సులతోపాటు, యువకుడు, అందరివాడుగా పేరు తెచ్చుకున్న రాజబాబుకు స్థానికత అంశం కూడా రాజకీయంగా కలిసొస్తుందని అతని అభిమానులు ఆశావహ దృక్పథంలో ఉన్నారు. ఇదిలా ఉంటే మరోమారు మాజీ మంత్రి గంటా భీమిలి నుంచి పోటీచేస్తారని ఊహాగానాలు వినిపిస్తున్న నేపథ్యంలో చివరి నిమిషంలో ఎటువంటి రాజకీయ పరిణామాలు చోటుచేసుకుంటాయో ఎదురుచూడాలి.

నిర్ణయాత్మక ప్రత్యామ్నాయ స్థితిలో జనసేన

భీమిలి నియోజకవర్గంలో జనసేన పార్టీ రాజకీయంగా నిర్ణయాత్మక స్థితిలో ఉందని చెప్పొచ్చు. 2019 ఎన్నికల్లో ఆ పార్టీ తరపున పోటీచేసి పంచకర్ల సందీప్‌కు అనూహ్యంగా 24,114 ఓట్లు వచ్చాయి. తద్వారా ప్రధానపార్టీలు వైసిపి, టిడిపిలకు ధీటుగా తామే ప్రత్యామ్నాయమని జనసేన సంకేతాన్నిచ్చింది. రానున్న ఎన్నికల్లోనూ విద్యాధికుడు, స్థానికుడు, సమస్యలపై సత్వరమే స్పందించే గుణమున్న సందీప్ మళ్లీ పోటీ చేసేందుకు ఆసక్తి చూపుతుండడంతో ఇక్కడ పోటీ రసవత్తం కానుందని వేరే చెప్పనక్కరలేదు.

సమస్యలపై పోరాటమే అజెండాగా వామపక్షాలు

వైసిపి, టిడిపి, జనసేన వంటి ప్రధాన పార్టీలు వ్యక్తుల ప్రాతిపదికగా ప్రజల్లోకి వెళ్తుంటే, అందుకు భిన్నంగా విధానాల ప్రాతిపదికన వామపక్షాలు ప్రజాసమస్యలపై నిరంతరం పోరాటాలు చేస్తూ సామాన్య జనంలో ఉంటున్నాయి. గెలుపోటములతో నిమిత్తం లేకుండా పనిచేసే వామపక్షాలకు, పేద ప్రజలు, కష్టజీవులు అండగా నిలుస్తుండగా, సిపిఎం, సిపిఐ ఇతర వామపక్షాలుకూడా అదే పంథాల్లో ప్రజల కోసమే పనిచేస్తున్నాయి. ఇవన్నీ ఇలా ఉంటే, రానున్న ఎన్నికల్లో వీటన్నింటితోపాటు రాజకీయ ఎత్తులు, పొత్తులు, ఇతర అంశాలుకూడా ఎన్నికల్లో ఫలితాలను ప్రభావితం చేసే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు.

అరాచక పాలనకు బ్రాండ్ అంబాసిడర్ జగన్

టిడిపి జిల్లా అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు



గాజువాకలో నిరసన చేపడుతున్న టిడిపి నేతలు

ప్రజాశక్తి- గాజువాక: అరాచక పాలనకు సిఎం జగన్ బ్రాండ్ అంబాసిడర్‌గా రాష్ట్రప్రజలను నానా ఇబ్బందులకు గురిచేస్తున్నారని టిడిపి జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు మండిపడ్డారు.. పుంగనూరులో మంత్రి పెద్దిరెడ్డి ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ కార్యకర్తలపై రాళ్ల దాడిని ఖండిస్తూ పాతగాజువాక జంక్షన్‌లో నిరసన చేపట్టారు. మంత్రి పెద్దిరెడ్డిని డిస్మిస్ చేయాలని డిమాండ్ చేశారు. గాజువాక నియోజవర్గ పార్టీ పరిశీలకులు కిమిడి రామ్‌మల్లిక్, అనకాపల్లి మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద్, గాజువాక నియోజవర్గ సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్, రాష్ట్ర పార్టీ కార్యదర్శి బొండా జగన్, జివిఎంసి డిప్యూటీ ఫ్లోర్ గంధం శ్రీనివాసరావు, కార్పొరేటర్లు పల్లా శ్రీనివాసరావు, మళ్ళీ ముత్యాల నాయుడు. తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలు ఎస్. అనంతలక్ష్మి జిల్లాఉపాధ్యక్షులు పులి వెంకటరమణారెడ్డి, కె.నూకరాజు, ఆడారి వెంకట్రావు, బలగ బాలు నాయుడు, ఎల్ దేవి, నమ్మి పుష్ప, రాణి, లక్ష్మి, టి సరోజిని పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాల తొలగింపు

ప్రజాశక్తి- సీతమ్మధార : జివిఎంసి కమిషనర్ 23వ వార్డు చైతన్య నగర్ లో అనధికార నిర్మాణాలను టౌన్ ప్లానింగ్ అధికారులు తొలగించారు ఈ సందర్భంగా టిపిఎస్ తేజ మాట్లాడుతూ జోన్ 3 పరిధిలో, అనధికారికంగా నిర్మిస్తున్న నిర్మాణాలను దఫదఫాలుగా తొలగిస్తున్నామన్నారు. భవన నిర్మాణదారులు జివిఎంసి నుంచి అనుమతి పొందిన ప్రకారం నిర్మించాలని లేనిపక్షంలో ఇటువంటి చర్యలు తప్పవన్నారు.కార్యక్రమంలో టిపిఒ అనిత, పట్టణ ప్రణాళిక అధికారులు పాల్గొన్నారు.

గంజాయి అక్రమ రవాణాపై తనిఖీలు

ప్రజాశక్తి - ఆనందపురం: మండలంలో సర్తరవు జంక్షన్ వద్ద గంజాయి అక్రమ రవాణాపై శుక్రవారం ఎస్ఐ నరసింహమూర్తి ఆధ్వర్యంలో క్యూఆర్ టీం తనిఖీలు నిర్వహించారు. ఇటీవల గంజాయి, గుట్కా అక్రమ రవాణా చేస్తున్న నేపథ్యంలో చెక్ పోస్ట్ వద్ద పలు వాహనాలను తనిఖీ చేశారు.

జివిఎంసి ఉన్నతపాఠశాల విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి -భీమునిపట్నం : ఇటీవల విశాఖ నగరంలో జివిఎంసి ఆధ్వర్యంలో నిర్వహించిన ఎకో వైజాగ్ కిడ్స్ ఆర్ట్ కాంటెస్ట్ పోటీల్లో స్థానిక ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్లు హెచ్ఎం సిహెచ్‌సింహాచలం తెలిపారు. ఈ పోటీల్లో సీనియర్ విభాగంలో కె రేవతి, కె నవదీప్, వరుసగా ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలవగా, కార్తీక్ తతీయ స్థానంలో నిలిచాడు. జూనియర్ విభాగంలో కె అశోక్ కుమార్, మోహిత్ కుమార్, మల్లికార్జున్ వరుసగా ప్రథమ, ద్వితీయ, తతీయ స్థానాల్లో నిలిచి బహుమతులు సాధించారు

పర్యావరణ పరిరక్షణపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి -గాజువాక : పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని 13వ అదనపు జిల్లా జడ్జి గోవర్ధన్ అన్నారు శ్రీనగర్‌లోని చైతన్య ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో శుక్రవారం చిన్నారులతో మొక్కలు, ప్లకార్డులు పట్టుకుని పర్యావరణ అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం గాజువాక కోర్టు సముదాయం ఆవరణలో ప్రేమలత, ఇతర జడ్జిలు శ్రీవిద్య, శ్రీలక్ష్మి, రాజేంద్రబాబు, కృష్ణారావు, మహాలక్ష్మి, లాయర్లు ఆధ్వర్యంలో స్కూల్ పిల్లలతో కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఆర్‌వి రమణ, కోఆర్డినేటర్ వెంకటరమణ, డీన్ నాగేశ్వరరావు, సి ఇన్‌ఛార్జి వెంకట అప్పారావుపాల్గొన్నారు.

రైతులకు రాయితీపై విత్తనాలు, ఉపకరణాలు

ప్రజాశక్తి -పద్మనాభం: ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగుచేస్తున్న దళిత రైతులకు కేంద్ర ప్రభుత్వం రాయితీపై ఇస్తున్న రూ. పదివేల విలువ గల విత్తనాలు, వ్యవసాయ ఉపకరణాలను శుక్రవారం అనంతవరం గ్రామంలో ఎంపిపి కె.రాంబాబు పంపిణీ చేశారు. ఎస్‌సి కార్పొరేషన్ ద్వారా రాయితీపై అందిస్తున్న వీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు.కార్యక్రమంలో ఎస్‌సి కార్పొరేషన్ సిబ్బంది శంకరరావు, భవానీ, భాస్కర్ పాల్గొన్నారు,

అనంత పద్మనాభస్వామి దేవాలయాన్ని టిటిడి దత్తత తీసుకోవాలి

ప్రజాశక్తి -పద్మనాభం : మండలకేంద్రం పద్మనాభంలో వెలసిన అనంతపద్మనాభ స్వామి దేవాలయాన్ని తిరుమల తిరుపతి దేవాలయానికి దత్తత తీసుకోవాలని తిరుమల తిరుపతి దేవస్థానం ఛైర్మన్ వైవి సుబ్బారెడ్డికి స్థానిక ఎంపిపి రాంబాబుకు వినతిపత్రం అందజేశారు. శుక్రవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్షలో సుబ్బారెడ్డిని కలిసి, టిటిడికి పద్మనాభస్వామి ఆలయాన్ని అనుసంధానిస్తే అభివృద్ధి జరుగుతుందని విన్నవించారు.

దోమల నివారణ అందరి బాధ్యత

ప్రజాశక్తి- గోపాలపట్నం : డెంగీ, మలేరియా, ఇతర వ్యాధులకు కారణమైన దోమల నివారణ అందరి బాధ్యతగా చేపట్టాలని జెడిసి మల్లయ్యనాయుడు, జివిఎంసి కోఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు అన్నారు. శుక్రవారం 91వ వార్డు పాత గోపాలపట్నం జువాలమ్మ కాలనీలో ఫ్రైడే డ్రై డే నిర్వహించి, దోమల నివారణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గోపాలపట్నం చెరువులో గంభూషియా చేపల పిల్లలను వదిలారు. మలేరియా ఇన్‌స్పెక్టర్ బి నాయుడు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సన్యాసిరావు, వైసిపి నేతలు గునిశెట్టి శ్రీనివాసరావు, కరణం కనకరాజు, జి అప్పలస్వామి నాయుడు, గేదెల మురళీకృష్ణ, ఊటపల్లి గోవిందు, గొంతిన నాగరాజు, సురేష్, ఉష, టి. నరస య్యమ్మ, కుమారి, కృష్ణంరాజు, కెవి రమణ పాల్గొన్నారు.

విత్తనోత్పత్తిపై అవగాహన

ప్రజాశక్తి -ఆనందపురం : గ్రామీణ విత్తనోత్పత్తిపై బోనీ గ్రామంలో రైతులకు అవగాహన కల్పించారు. వ్యవసాయ శాఖ ఏడిఏ చదువుల సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ, ఈ పథకం కింద ఎంటియు1121 ఫౌండేషన్ విత్తనాలు 25 ఎకరాల్లో సాగుచేసేందుకు సంబంధిత రైతులకు 50శాతం రాయితీపై పరివిత్తనాలను అందజేస్తున్నామన్నారు. పంట కోత సమయంలో వీటిని మామూలు ధాన్యంగా కాకుండా, విత్తనాల కోసం ఉంచాలన్నారు. భీమిలి ఏడిఎ బి.విజయప్రసాద్ మాట్లాడుతూ, వరిపంటలో యాజమాన్య పద్ధతులను వివరించారు. ఏఎలు సిహెచ్. సంధ్య రత్నప్రభ, సురేష్, శ్రీకాంత్, వీఏఎ దిలీప్ పాల్గొన్నారు.

రాయితీ టమోటాకు రైతుబజారులో బారులు

ప్రజాశక్తి -కరాస: బయట మార్కెట్‌లో కిలో టమోటా ధర ఏకంగా రూ. 200కు చేరుకున్న నేపథ్యంలో ప్రభుత్వం రైతుబజార్లలో రాయితీపై అందిస్తున్న టమోటా కోసం రైతుల ఎగబడుతూ బారులు దీరుతున్నారు. శుక్రవారం మర్రిపాలెం రైతు బజారులో రెండు ప్రత్యేక కౌంటర్ల ద్వారా రాయితీ టమోటాల అమ్మకం చేపట్టగా, ఆధార్, రేషన్‌కార్డులతో భారీ సంఖ్యలో ప్రజలు వచ్చి బారులు దీరారు. టమోటాల కోసమని ఉదయం రైతుబజారుకు వచ్చిన అనేకమంది మధ్యాహ్నానికిగానీ కూరగాయలతో ఇంటికి చేరని పరిస్థితి ఉందంటే, కిలో టమోటా కోసం ప్రజలు ఎంతగా పడిగాపులు పడ్డారో స్పష్టమౌతోంది. ఈ పరిస్థితి నుంచి ఎప్పటికి విముక్తి వస్తుందోమరి.



మర్రిపాలెం రైతుబజారులో బారులుదీరిన జనం

క్షయ వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహార కిట్లు అందజేత

ప్రజాశక్తి -ఆనందపురం : మండలంలోని 14మంది క్షయవ్యాధిగ్రస్తులకు మందులతో పాటు పౌష్టికాహారం కిట్లను ఆనందపురం పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ ఎం గంగు నాయుడు అందజేశారు. ఈ సందర్భంగా క్షయవ్యాధి లక్షణాలు, నిర్ధారణ, నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రభుత్వపరంగా ఉచితంగా ఇస్తున్న మందులు, పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. స్థానిక పిహెచ్‌సిలో క్షయవ్యాధి నిర్ధారణ పరీక్షలు,మందులు అందుబాటులో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో సిహెచ్‌ఒ పి. సాంబమూర్తి, సబ్ యూనిట్ అధికారి నూకరాజు, ఆరోగ్య పర్యవేక్షకులు ఎన్ వి రమణ, పి సన్యాసిరావు, ఎస్‌టిఎస్ సురేష్, ఎస్‌టిఎల్ఎస్ బ్రహ్మాజీ, టిబి హెచ్‌వి అనూష, కృష్ణ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సంపూర్ణ పోషణ కిట్లు పంపిణీ

గోపాలపట్నం : 91వ వార్డు పాత గోపాలపట్నం అంగన్వాడీ కేంద్రంలో గర్భిణులకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను జివిఎంసి కోఆప్షన్ సభ్యులుబెహరా భాస్కరరావు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గునిశెట్టి శ్రీనివాసరావు, జి అప్పలస్వామినాయుడు, గేదెల మురళీకృష్ణ, ఊటపల్లి గోవిందు, గొంతెన నాగరాజు, పివిఎన్ రాజు, బల్లంకి వెంకటరావు, పసుపురెడ్డి రమణ, ఓ అప్పలరాజు, కరణం కనకరాజు, సురేష్, టి.నరసయ్యమ్మ, ఉష, సుమతి, ఆర్‌పిలు నాగేంద్రమణి శంకరమ్మ, ఎఎన్ఎంలు శాంతి సువార్త, రాధ, ఆశ వర్కర్లు రోహిణీ, ప్రభ, మహిళా పోలీస్ శైలజ పాల్గొన్నారు.

ఆరిలోవ :తల్లి పాల వారోత్సవాల సందర్భంగా 12వ వార్డు పోలీస్ స్టేషన్ దరి అంగన్వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు వార్డు కార్పొరేటర్ అక్కరమాని రోహిణీరామన్ పోషకాహార కిట్లు పంపిణీ చేశారు. వైసిపి నేతలు కన్నేటి సుబ్బారెడ్డి, అర్జున్, మోహన్, శ్రీను పాల్గొన్నారు.

భీమునిపట్నం : తల్లి పాల వారోత్సవాల్లో భాగంగా మండలంలోని దాకమర్రి అంగన్వాడీ కేంద్రంలో గర్భిణులకు పౌష్టికాహార కిట్లను ఎంపిపి దంతులూరి వాసురాజు శుక్ర వారం అందజేశారు. సర్పంచ్ చెల్లూరి పైడప్పడు, ఎంపిటిసి చెల్లూరి నగేష్ బాబు, పంచాయతీ కార్యదర్శి రఘునాథబాబు పాల్గొన్నారు.

ఆరిలోవ :తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా 13వ వార్డు ఆరిలోవ కాలనీ, ఎఎస్ఆర్ నగర్ అంగన్వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను వార్డు కార్పొరేటర్ కెల్ల సునీత సత్యనారాయణ అందజేసారు.కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ తులసి, ఎఎన్ఎంలు, మహిళా పోలీస్, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

8న పోరుయాత్ర బహిరంగ సభను విజయవంతం చేయండి



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఐద్వా నేతలు

ప్రజాశక్తి- మాధవధార : మహిళలపై హింసను వ్యతిరేకిస్తూ ఐద్వా ఆధ్వర్యంలో మహిళల పోరుయాత్రలో భాగంగా ఈనెల 8న విజయవాడలో నిర్వహించే బహిరంగ సభలో పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కంచరపాలెం జోన్ ఐద్వా అధ్యక్ష కార్యదర్శులు కె. అనురాధ, ఎ. పుష్ప కోరారు. శుక్రవారం కంచరపాలెం సిఐటియు కార్యాలయంలో వాల్‌పోస్టరును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.మద్యం, మత్తు పదార్థాలు కారణంగా మహిళల పట్ల హింస పెరిగిపోతోందని, హింస, ఆశ్లీలత. అసమానతలను ప్రేరేపించే చలనచిత్రాలు, టీవీ సీరియల్స్, ఇంటర్నెట్ కార్యక్రమాలను ప్రభుత్వం తక్షణమే నిషేధించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సహాయ కార్యదర్శి కె హేమలత పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలి


జోనల్ కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న సిపిఎం నేతలు

ప్రజాశక్తి -గాజువాక : గాజువాకలో మూడు రోజులుగా తాగునీరు సరఫరాలేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వెంటనే సమస్యను పరిష్కరించాలని సిపిఎం నేతలు కోరారు. శుక్రవారం జెడ్‌సి సింహాచలంను కలిసిన సిపిఎం కార్యదర్శి ఎం రాంబాబు వినతిపత్రం అందజేశారు. చిన్న గంట్యాడ, స్వతంత్ర నగర్, రామచంద్ర నగర్, సుందరయ్య కాలనీ, దుర్గా నగర్, అరుణాదేవి కాలనీ తోకాడ, శ్రీనగర్, దశమకొండ, నడుపూరు, వుడా కాలనీ ప్రాంతాలకు మూడు రోజులుగానీటి సరఫరా లేదని, కనీసం ట్యాంకర్ల ద్వారానైనా నీటిని అందించ లేదన్నారు.కార్యక్రమంలో జోన్ కమిటీ సభ్యులు ఎ.లోకేష్, డి రమణ, వై లక్ష్మణ్, ప్రసాద్ పాల్గొన్నారు.

రోటరీ గవర్నర్ పర్యటన



పుస్తకాలు పంపిణీ చేస్తున్న,డిస్ట్రిక్ట్ గవర్నర్ సుబ్బారావు.

ప్రజాశక్తి -గాజువాక : ఆటోనగర్ రోటరీ క్లబ్‌ను విశాఖపట్నం సౌత్ క్లబ్ రోటరీ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 3020 గవర్నర్ రావూరి సుబ్బారావు (దత్తా) శుక్రవారం పర్యటించారు. ఇచ్ఛాపురం నుండి విజయవాడ వరకుఉన్న రోటరీ క్లబ్‌లన్నింటినీ ఏడాదిలో ఒకసారి సందర్శనలో భాగంగా క్లబ్ చేస్తున్న పనులను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా చట్టివానిపాలెం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు అవసరమైన పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. క్లబ్ చేస్తున్న పలు సేవా కార్యక్రమాలను గవర్నర్ ప్రశంసించారు. ప్రెసిడెంట్. ఉమా మహేశ్వరరెడ్డి క్లబ్ చేస్తున్న, చేయబోయే కమ్యూనిటీ, మెటర్నిటీ, చైల్డ్ హెల్త్ కేర్, రోటరీ ఫ్యామిలీ కార్యక్రమాలను వివరించారు. అసిస్టెంట్ గవర్నర్ బ్రహ్మానందం, సెక్రెటరీ వెంకటగిరి, క్లబ్ మెంబర్లు యార్లగడ్డ వెంకన్నచౌదరి, రమేష్, కిషోర్‌కుమార్, చీకటి సత్యనారాయణ పాల్గొన్నారు.

త్యాగానికి ఆర్థిక ఇబ్బందులు నజరానా!

అదానీ గంగవరం పోర్టు నిర్వాసిత కార్మికుల దీక్ష శిబిరంలో తాతారావు


దీక్షల్లో పాల్గొన్న నిర్వాసిత కార్మికులు

ప్రజాశక్తి -గాజువాక: ఆదానీ గంగవరం పోర్టు నిర్మాణం కోసం సర్వం త్యాగం నిర్వాసిత కార్మికులు ఆర్థిక ఇబ్బందులతో సతమతమౌతున్నారని, వారి త్యాగానికి పోర్టు యాజమాన్యం ఇచ్చిన నజరానా ఇదేనా అని గంగవరం పోర్ట్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి నోలి తాతారావు ఆవేదన వ్యక్తం చేశారు. తమసమస్యల పరిష్కారానికి 32రోజులుగా నిరవధిక దీక్షలు చేస్తున్న నిర్వాసిత కార్మికుల దీక్షా శిబిరంలో శుక్రవారం 64వ వార్డు జనసేన గంగవరం పోర్టు ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి నొల్లి తాతారావు మాట్లాడుతూ నిర్వాసిత కార్మికులు వేతనాల కోసం పోరాడుతుంటే, చర్చలపేరుతో యాజమాన్యం మొండివైఖరి ప్రదర్శిస్తోందన్నారు. ఇప్పటికైనా నిర్వాసితుల న్యాయమైన డిమాండ్లు నెరవేర్చకుంటే ఉద్యమం తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిఐటియు స్టీల్ జోన్ ప్రధాన కార్యదర్శి అప్పలరాజు, వాసుపల్లి ఎల్లాజీ, గంటిపిల్ల అమ్మోరు, మాధ అప్పారావు, కదిరి సత్యానందం, గంటిపిల్లి లక్ష్మయ్య, నొల్లి స్వామి, పేర్ల నూకరాజు పాల్గొన్నారు..

17 నుంచి సిపిఐ రాష్ట్ర వ్యాప్త బస్సుయాత్ర



సమావేశంలో మాట్లాడుతున్న సిపిఐనేత పైడిరాజు

ప్రజాశక్తి -ములగాడ : కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఈనెల 17న కూర్మన్నపాలెంలో ప్రారంభంకానున్న సిపిఐ రాష్ట్రవ్యాప్త బస్సుయాత్రను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి పైడిరాజు డిమాండ్ చేశారు. శుక్రవారం సిపిఐ పశ్చిమ నియోజకవర్గం జనరల్ బాడీ సమావేశం బి హరినాథ్ అధ్యక్షతన మల్కాపురంలో జరిగింది. ఈసందర్భంగా మాట్లాడుతూ, ప్రభుత్వ రంగ సంస్థలను ప్రభుత్వ ఆధీనంలోనే నడపాలని, కార్పొరేట్లకు అప్పగిస్తే ఊరుకోబోమని హెచ్చరించారు.

ఉద్యమాలు, పోరాటాలు, ప్రాణాలు త్యాగం చేసి సంపాదించుకున్న విశాఖ ఉక్కును ప్రయివేటుపరం చేయొద్దని, గంగవరం పోర్టు నిర్వాసిత కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో పశ్చిమ నియోజకవర్గం కార్యదర్శి సత్యాంజనేయ, సహాయ కార్యదర్శి గుడాల రాంబాబు, నేతలు సత్యానందరావు, గండి అప్పారావు, ఎన్‌వి త్రినాథ్, పోతిన రాము మాధవరావు, కోరమండల్ కాంటాక్ట్ లేబర్ యూనియన్ సత్తిబాబు, కోలాడ శంకరరావు, మహిళా సంఘం నాయకులు గుడాల జయ, గండి రవణమ్మ, లక్ష్మి, పందిరి జయ, డిహెచ్‌పిఎస్ నేతలు కామేశ్వరరావు వెంకట్ పాల్గొన్నారు.

టిడిపి హయాంలోనే మహిళలకు న్యాయం


మహాశక్తి చైతన్య రథాన్ని ప్రారంభిస్తున్న గంటా

ప్రజాశక్తి- సీతమ్మధార : చంద్రబాబు హయాంలో, టిడిపి పాలనలోనే మహిళలకు న్యాయం జరిగిందని ఉత్తర ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం తన కార్యాలయం వద్ద మహాశక్తి చైతన్యరథాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రాజమండ్రి మహానాడులో చేసిన తీర్మానంలో మహాశక్తి అంశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు 40రోజులపాటు చైతన్యరథం ప్రచారం సాగుతుందన్నారు. వైసిపి హయాంలో జగన్‌రెడ్డి రాక్షసపాలనలో మహిళలకు జరిగిన అన్యాయాన్ని ఈసందర్భంగా వివరిస్తామన్నారు. శంకుస్థాపనల హడావిడి తప్ప, జగన్‌రెడ్డి ప్రజలకు చేసిందేమీ లేదన్నారు.ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు. ఇన్‌ఛార్జి చిక్కాల విజయబాబు, పెద్దసంఖ్యలో టిడిపి నేతలు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

కొండప్రాంతాలకు సిటీబస్సు నడపాలని ధర్నా



డిపో వద్ద ధర్నా చేస్తున్న సిపిఎం నేతలు

ప్రజాశక్తి -ములగాడ: జనతా కాలనీ మీదుగా త్రినాధపురం వరకు వస్తున్న 38జె ఆర్‌టిసి బస్సును క్రాంతినగర్ మీదగా కాకరలోవ వరకు తిప్పాలని సిపిఎం మల్కాపురం జోన్ కమిటీ ఆధ్వర్యంలో గాజువాక ఆర్‌టిసి డిపో వద్ద శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈధర్నాలో సిపిఎం మల్కాపురం జోన్ కార్యదర్శి పి.పైడిరాజు మాట్లాడుతూ. 20ఏళ్లుగా నడుస్తున్న బస్సును ఆపడం సరికాదని, దీనిపై గాజువాక డిపో మేనేజర్‌కు ప్రజలు, ప్రజాసంఘాలు మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదన్నారు. ఫలితంగా విద్యార్థులు, మహిళలు, దినసరి కూలీలు, ఉద్యోగులు ఇబ్బందులుపడుతున్నారన్నారు. రద్దీగా ఉండే ఈ రూట్‌లో బస్సు తిప్పాలని కోరారు. అనంతరం డిపోమేనేజర్‌కు వినతిపత్రం అందించారు. దీనిపై స్పందిస్తూ రూట్ సర్వే అనంతరం అవకాశముంటే బస్సును తిప్పుతామన్నారు. సిపిఎం మల్కాపురం జోన్ నేత కె.పెంటారావు, పిసిని రామారావు, ఎం.జయలక్ష్మి, ఆర్.విమల ,బి.మమత, ప్రజలు వై.కల్యాణి, కళావతి గీత, రాధ బి.రాజేశ్వరి పి.వరలక్ష్మి ,రామలక్ష్మి ఎన్.ఉమా, నరేష్ ,గణేష్ పాల్గొన్నారు.

కిడ్నీ బాధితురాలికి వైసిపి నేత ఆర్థిక సాయం

ప్రజాశక్తి-సీతమ్మధార: జివిఎంసి 33వ వార్డు, బంగారమ్మ మెట్ట కాలనీలో కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్న ఎజ్జిపురపు లీల అనే మహిళ వైద్యానికి దక్షిణ నియోజకవర్గ వైసిపి నేత సీతంరాజు సుధాకర్ రూ.ఐదు వేలు ఆర్థికసాయాన్ని ఆ వార్డు అధ్యక్షుడు రంది గోపీకృష్ణ ద్వారా అందించారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీయర్ ఆడారి వెంకట్ మహేష్, భీశెట్టి ట్టి రాజు, మైనారిటీ ప్రెసిడెంట్ మదీనాఖాన్, చంద్రకళ, సంతోష్ పాల్గొన్నారు.

10 నుంచి పవన్‌కల్యాణ్ వారాహి యాత్ర

ప్రజాశక్తి- సీతమ్మధార : నగరంలోని ప్రజల సమస్యలను తెలుసుకోవడానికి ఈనెల 10 నుండి 19 వరకు జనసేన అధినేత పవన్ కల్యాణ్ వారాహి యాత్ర నిర్వహించ నున్నారని జనసేన కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ తెలిపారు. శుక్రవారం పౌర గ్రంథాలయంలో విలేకరులతో మాట్లాడుతూ గత ఏడాది జనవాణి పేరుతో నగరంలో కార్యక్రమానికి పిలుపునిస్తే, వేలాది ఫిర్యాదులు వస్తాయని, పోలీసులతో అడ్డుకొని, వైసీపీ నేతలు తమ నాయకుడిని ఇక్కడి నుంచి పంపించేశారన్నారు. వారాహి యాత్రలో పవన్ కల్యాణ్‌కు నేరుగా వినతులు ఇచ్చేలా ఏర్పాటు చేస్తామని, నగర ప్రజల వినియోగించుకుని విజయవంతం చేయాలని కోరారు. చోడవరం జనసేన ఇన్‌ఛార్జి పిఎస్‌ఎన్ రాజు వీర మహిళ రూపాదేవి పాల్గొన్నారు.

కనీస పెన్షన్ రూ.9 వేలు ఇవ్వాలి



స్టిక్కర్లను ఆవిష్కరిస్తున్న పెన్షనర్లు

ప్రజాశక్తి -గాజువాక : రిటైర్ పర్సన్కు కనీస పెన్షన్ రూ.9వేలు ఇవ్వాలని ఆప్రా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కే. దీనబంధు, హుస్సేన్ కోరారు. శుక్రవారం గాజువాక సిఐటియు కార్యాలయంలో ఇపిఎస్ 95 పెన్షనర్ల నిరసనకు సంబంధించిన స్టికర్లను ఆప్రా నాయకులు విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పెన్షనర్ల దంపతులకు వైద్యసదుపాయంతోపాటు రైల్వే ప్రయాణంలో సగం రాయితీ నివ్వాలని కోరారు. హక్కుల సాధనకు ఆప్రా ఆధ్వర్యంలో అనేక పోరాటాలు, నిరసనలు చేపట్టామన్నారు. కార్యక్రమంలో బి గుర్రప్ప పాల్గొన్నారు.

రాహుల్‌గాంధీకి సుప్రీంకోర్టులో ఊరటపై కాంగ్రెస్ నేతల సంబరాలు


స్వీట్లు పంచుతున్న కాంగ్రెస్ నేతలు

ప్రజాశక్తి- గాజువాక : రాహుల్‌గాంధీ శిక్షపై సుప్రీంకోర్టు తీసుకున్న నిర్ణయం ప్రజాస్వామ్య విజయమని, గాజువాక కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త జెర్రిపోతుల ముత్యాలు అన్నారు. రాహుల్‌గాంధీకి తీర్పుపై స్టే ఇవ్వడంతో కాంగ్రెస్ నేతలు సంబరాలు చేసుకున్నారు స్వీట్స్ పంచారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం కక్షసాధింపుతో రాహుల్‌గాంధీపై తప్పుడు కేసులు పెట్టి పార్లమెంట్ సభ్యత్వం రద్దు చేసినా, కోర్టులు, న్యాయస్థానాలు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు, యరబాభూలోక, కట్టా అప్పారావు, శనివాడ హరిబాబు, శ్రీను, ఆనంద్, పాల్గొన్నారు.

నేడు న్యాయవాదుల జిల్లా మహాసభ

ప్రజాశక్తి- లీగల్ రిపోర్టర్ : ఆల్‌ఇండియా లాయర్స్ యూనియన్, ఉమ్మడి విశాఖపట్నం జిల్లా పదవ మహాసభలు శనివారం అల్లూరి విజ్ఞాన కేంద్రంలో నిర్వహించనున్నట్లు అధ్యక్షులు బివి రామాంజనేయరావు తెలిపారు. దామోదర్ సంజీవయ్య లావర్సిటీ విసి ప్రొఫెసర్ పి.శ్రీసుధ ముఖ్యఅతిథిగా పాల్గొని మహాసభలను ప్రారంభిస్తారని, విశిష్ట అతిథిగా జిల్లా విశ్రాంత న్యాయమూర్తి యు.సత్యాఆరవు పాల్గొని 'భారతీయ వారసత్వ చట్టం ప్రస్తుత పరిస్థితులు" అంశంపై ప్రసంగిస్తారన్నారు. ప్రత్యేక ఆహ్వానితులుగా విశాఖపట్నం న్యాయవాదుల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, చింతపల్లి రాంబాబు, పైలా శ్రీనివాసరావు పాల్గొంటారని తెలిపారు. మహాసభల చివరలో ఎగ్జిక్యూటివ్ కమిటీ ఎన్నిక జరగునుందని జిల్లా ప్రధాన కార్యదర్శి సిహెచ్ ఆనందరెడ్డి తెలిపారు.

బకాయి జీతాలు చెల్లించాలని

పంచాయతీ కార్మికుల ధర్నా

ప్రజాశక్తి- అనకాపల్లి

బకాయి జీతాలు చెల్లించాలని కోరుతూ స్థానిక కలెక్టరేట్ వద్ద శుక్రవారం పంచాయతీ పారిశుధ్య కార్మికులు, గ్రీన్ అంబాసిడర్లు, ఎలక్ట్రీషియన్లు సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి జి కోటేశ్వరరావు మాట్లాడుతూ అనకాపల్లి జిల్లాలో 654 గ్రామపంచాయతీలలో పారిశుధ్య కార్మికులు, గ్రీన్ అంబాసిడర్లు, ఎలక్ట్రీషియన్లు అనేక సంవత్సరాలుగా చాలీచాలని జీతాలతో పనిచేస్తున్నారని, వీరికి నెలల తరబడి జీతాలు ఇవ్వకపోవడంతో వారి కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. టెండర్ విధానం రద్దుచేసి ప్రభుత్వం నేరుగా జీతం చెల్లించాలని కోర్టు తీర్పు ఇచ్చినా ఎక్కడ అమలు కావడం లేదన్నారు. గ్రామాభివృద్ధికి వచ్చిన పంచాయతీ నిధులను రాష్ట్ర ప్రభుత్వం ఇతర పనులకు వాడుకోవడంతో నిధులు లేక కార్మికుల జీతాలు ఇవ్వడం లేదని తెలిపారు. కార్మికులకు ఇవ్వాల్సిన సబ్బులు, నూనె, తువ్వాలు, యూనిఫామ్, బూట్లు, రక్షణ పరికరాలు ఎక్కడా ఇవ్వడం లేదన్నారు. గతంలో ప్రభుత్వం ఇచ్చిన జీవో 57, 132, 680 లను అమలు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా జిల్లా పంచాయితీ అధికారి ధర్నా శిబిరానికి వచ్చి కార్మికులకు సంతృప్తికరమైన సమాధానం చెప్పకపోవడంతో ఆమె వాహనాన్ని అడ్డగించారు. దీంతో ఆమె ధర్నా శిబిరానికి వచ్చి కార్మికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. జీతాలు వేయాలని ఆదేశించామని, ఎక్కడా జీతాలు రాకుంటే తెలియజేయాలని ఆమె కోరారు. కార్యక్రమంలో సిఐటియూ జిల్లా అధ్యక్షులు ఆర్.శంకర్రావు, యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పలివేల చిన్నారావు, మలకలపల్లి రాజు, నక్కా రవికుమార్, సీతారాం, కె.వెంకటరమణ, ఈశ్వరరావు, పరదేశి, జి.సన్యాసినాయుడు, ఈశ్వరమ్మ కార్మికులు పాల్గొన్నారు.



ధర్నాలో మాట్లాడుతున్న సిఐటియు నేత కోటేశ్వరరావు

కలపాక పంచాయతీలో కలెక్టర్ పర్యటన

ప్రజాశక్తి - పరవాడ : మండలంలోని కలపాక పంచాయతీ పరిధిలో జిల్లా కలెక్టర్ రవి పఠాన్‌శెట్టి శుక్రవారం పర్యటించారు. పంచాయతీలోని జగనన్న కాలనీ, సచివాలయం, రైతు భరోసా కేంద్రాలను, మూల స్వయంవరం గ్రామాన్ని సందర్శించారు. జగనన్న కాలనీలో ఇప్పటికే గృహప్రవేశం చేసిన ప్రజలతో కలెక్టర్ మాట్లాడి వారి బాధలు, అడిగి తెలుసుకున్నారు. తర్వాత సచివాలయంలో రికార్డులను తనిఖీ చేశారు. ప్రజల నుండి వచ్చే వినతులను స్వీకరించాలని కోరారు. పంచాయతీ పరిధిలోని మూల స్వయంవరం గ్రామాన్ని సందర్శించారు. స్థానిక సర్పంచ్ బోండా కనకారావు ఆధ్వర్యంలో ఎన్టిపిసి కాలుష్యం కారణంగా శిథిలమైపోతున్న బిల్డింగులను, పెచ్చులు ఊడుతున్న ఇండ్లను కలెక్టర్‌కు చూపించారు. తమ గ్రామాన్ని తరలించాలని ప్రజలు కోరారు. ఈ విషయంపై కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ బోండా కనకారావు, తహశీల్దారు పి కనకారావు, ఎంపీడీవో హేమ సుందర్‌రావు, హౌసింగ్ ఏఈ రెడ్డి, సాయి, పంచాయతీ ఇఒ సుభాష్, స్థానిక వీఆర్వో భుజంగరావు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

చెట్లు నరికిన వారిపై చర్యలు తీసుకోండి

ప్రజాశక్తి - కె.కోటపాడు : తన భూమిలో చెట్లను అన్యాయంగా నరికిన వారిపై చర్యలు తీసుకోవాలని మండలంలోని లంకవానిపాలెం గ్రామానికి చెందిన విఆర్‌పి పెనుగంట్ల శ్రీను కోరారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ తన తాతల కాలం నుంచి సాగు చేస్తున్న భూమిలో ఎంతో శ్రమించి టేకు చెట్లను నాటి పెంచుకుంటున్నామని, తమ గ్రామానికి చెందిన కనక మహాలక్ష్మి నకిలీ భూపత్రాలు సృష్టించి తన భూమిలో ఉన్న టేకు చెట్లను నరికివేసిందని పేర్కొన్నారు. ఈ విషయమై గ్రామ సర్పంచ్ వేచలపు దొరబాబుతో పాటు గ్రామ పెద్దలకు తెలియజేయగా, వారు రికార్డులు పరిశీలించి ఆ భూమితోపాటు ఆ చెట్లు కూడా తమవని చెప్పినా, ఆమె ఎవరి మాట వినిపించుకోవడం లేదని పేర్కొన్నారు. తన భూమిలో ఉన్న చెట్లను అన్యాయంగా నరికిన కనకమహాలక్ష్మిపై చర్యలు తీసుకోవాలని రెండు రోజుల క్రితం ఏ.కోడూరు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినా ఇంతవరకు పట్టించుకోలేదని ఆరోపించారు. ఇప్పటికైనా అధికారులు, పోలీసులు తమ గ్రామానికి వచ్చి రికార్డులు పరిశీలించి తనకు న్యాయం చేయాలని కోరారు.

వాటర్ ట్యాంక్ నిర్మాణ పనులు ప్రారంభం

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండలంలోని వాలాబు గ్రామ పంచాయతీ శివారు నగరంపాలెం గ్రామానికి కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన జలజీవన్ మిషన్ ద్వారా పైపు లైన్, వాటర్ ట్యాంక్ నిర్మాణానికి వాలాబు గ్రామ ఉప సర్పంచ్ చీకుముక్కుల ఈశ్వరమ్మ శుక్రవారం కొబ్బరికాయ కొట్టి పనులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు టోకూరి శ్రీరాములు, జన్ని చిన్నయ్య దొర, జనర్ధనాదొర, సన్యాసిరావు, పి.అచ్చిబాబు, సింహాచలం పాల్గొన్నారు.

అందుబాటులో యూరియా

ప్రజాశక్తి-దేవరాపల్లి : రైతులకు యూరియా అందుబాటులో ఉందని వ్యవసాయ శాఖ అధికారి వై.కాంతమ్మ తెలిపారు. శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ దేవరాపల్లి ఆర్‌బికెలో 12 టన్నుల యూరియా సిద్ధంగా ఉందన్నారు. బస్తా యూరియా రూ.266.50 అని, రైతులు తమ ఆధార్ కార్డుతో వ్యవసాయ అధికారులను సంప్రదించి పొందాలని సూచించారు. ప్రస్తుతం 30 టన్నుల యూరియా వేచలం, కలిగొట్ల, వాకపల్లి రైతు భరోసా కేంద్రాల్లో అందుబాటులో ఉంచామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌బికె సిబ్బంది కిరణ్ కుమార్, కాటిపాం సత్యారావు, భాగ్యశ్రీ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు మరింత వేగవంతం

జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి రాజన్నదొర



సమావేశంలో పాల్గొన్న మంత్రి రాజన్నదొర, కలెక్టర్, ఎమ్మెల్యే తదితరులు

ప్రజాశక్తి-అనకాపల్లి

ఎలమంచిలి శాసనసభ్యులు యువి. రమణమూర్తి రాజు మార్గదర్శకంలో జిల్లా కలెక్టర్ నాయకత్వంలో వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ ఎలమంచిలి నియోజకవర్గాన్ని ప్రగతి పథంలో నడిపించాలని జిల్లా ఇన్ఛార్జి మంత్రి పీడిక రాజన్నదొర పిలుపునిచ్చారు. కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ఎలమంచిలి నియోజకవర్గ అభివృద్ధిపై సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న పనులను ఎమ్మెల్యే రమణమూర్తి రాజు మంత్రి దృష్టికి తీసుకురాగా కలెక్టర్ వాటికి సంబంధించి జరిగిన పనులు, తీసుకోవలసిన చర్యలను గూర్చి అధికారులతో చర్చించి ఆదేశాలిచ్చారు. పూడిమడక జెట్టి, ఎలమంచిలి పట్టణంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, అనకాపల్లి -అచ్యుతాపురం రోడ్డు, ఎలమంచిలిలో రైలు ఓవర్ బ్రిడ్జ్, కొండకర్ల ఆవ సుందరీకరణ కార్యక్రమాల కొరకు చేపట్టవలసిన చర్యలను గూర్చి చర్చించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి, అసిస్టెంట్ కలెక్టర్ స్వరణ్ రాజ్, సిపిఓ రామారావు, డిఆర్‌డిఎ పిడి లక్ష్మీపతి, జిల్లా వ్యవసాయ అధికారి మోహన్ రావు, పంచాయతీరాజ్ ఈఈ వీరునాయుడు, ఆర్డబ్ల్యూఎస్ ఈఈ రమేష్, డిపిఒ శిరీష రాణి, మహిళా శిశు సంక్షేమ శాఖ పిడి అనంతలక్ష్మి, నియోజకవర్గంలోని అధికారులు పాల్గొన్నారు.

కొత్త స్థానాలకు బదిలీ అయిన

టీచర్లకు జీతాలు చెల్లించాలని ధర్నా



డిఇఒ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న యుటిఎఫ్ నేతలు, ఉపాధ్యాయులు

ప్రజాశక్తి- అనకాపల్లి

బదిలీల ప్రక్రియ పూర్తయి రెండు నెలలు గడుస్తున్నా నేటికీ కొత్త స్థానాల్లో చేరిన ఉపాధ్యాయులకు జీతాలు అందక పోవడం అన్యాయమని ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ అనకాపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి గొంది చినబ్బాయ్ అన్నారు. స్థానిక డిఇఒ కార్యాలయం ఎదుట శుక్రవారం జరిగిన నిరసన కార్యక్రమంలో మాట్లాడారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో ట్రాన్స్‌ఫర్ పొందిన ఉపాధ్యాయులను ఖజానా వెబ్ సైట్ లో ఆయా పాఠశాలల్లో ఉన్న ప్రస్తుత కేడర్ స్ట్రెంత్‌లో చేర్చాల్సి ఉందన్నారు. ఇందుకు ఉమ్మడి విశాఖ జిల్లా డీఈవో నుంచి మూడు జిల్లాల ఖజానా అధికారులకు కొత్త కేడర్ స్ట్రెంత్ వివరాలు లేఖ ద్వారా పంపినప్పటికీ, ఇంకా రాష్ట్ర స్థాయిలో డిటిఎ వద్ద ఈ ప్రక్రియ పెండింగ్లో ఉండడం శోచనీయమని వాపోయారు. దీనివల్ల ఉమ్మడి విశాఖ జిల్లాలో సుమారు వెయ్యి మంది వరకూ జీతాలు రాని పరిస్థితి నెలకొందని వాపోయారు. ఈ నెల 12వ తేదీ దాటితే బకాయి బిల్లులు పెట్టుకొనే అవకాశం కూడా ఉండదన్నారు. తత్ఫలితంగా అక్టోబర్ నెల వరకూ ఉపాధ్యాయులకు జీతాలు అందే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు మేలుకొని, వెంటనే కొత్త క్యాడర్ స్ట్రెంత్ వివరాలు ఖజానా వెబ్ సైట్ లో చేర్పించేందుకు తగిన ఏర్పాట్లు చేయాలని చినబ్బాయ్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిలర్ ఎల్లయ్యబాబు, సీనియర్ నాయకులు చిట్టయ్య, కామరాజు, శ్రీకాంత్, బాలరాజు, శంకర్, మామిడి అరుణ,రవి పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పర్యవేక్షణ

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండల కేంద్రంలో నూతనంగా నిర్మాణం జరుగుతున్న మండల ప్రజా పరిషత్ భవనంతో పాటు పలు అభివృద్ధి పనులను డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు శుక్రవారం పర్యవేక్షించారు. నూతన భవన నిర్మాణంపై ఇంజనీరింగ్ అధికారులకు పలు సూచనలు చేశారు. త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఆయన వెంట మాజీ ఎంపిపి కిలపర్తి భాస్కరరావు, వాలేటి నాగరాజు తదితరులున్నారు.

జగనన్న సురక్షకు అపూర్వ ఆదరణ

ప్రజాశక్తి-మునగపాక రూరల్ : ప్రభుత్వం నెల రోజుల పాటు నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమానికి ప్రజల నుండి అపూర్వ ఆదరణ లభించిందని వైసిపి అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ అన్నారు. ఇది దేశం గర్వించే పథకమని, రాష్ట్రంలో సరికొత్త చరిత్ర సృష్టించిందని పేర్కొన్నారు. స్థానిక మెయిన్ రోడ్‌లో తన క్యాంపు కార్యాలయంలో శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ ప్రజల గడప వద్దకు ప్రభుత్వ పాలన అందించాలన్న లక్ష్యం, ప్రజా సమస్యలను స్వయంగా తెలుసుకొని అక్కడికక్కడే పరిష్కరించాలన్న వినూత్న ఆలోచనతో ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి మానస పుత్రికగా ఈ కార్యక్రమం ప్రారంభమైందని చెప్పారు. ముఖ్యంగా గ్రామీణ, గిరిజన ప్రాంతాలలో జగనన్న సురక్ష కార్యక్రమానికి అద్భుత స్పందన లభించిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మళ్ల జయలక్ష్మి, జెడ్పిటిసి పెంటకోట స్వామి సత్యనారాయణ, వైసీపీ మండల కన్వీనర్ ఆడారి గణపతి అచ్చం నాయుడు, సచివాలయాల కన్వీనర్ పాలిమేర గణేష్, సర్పంచ్ దిమ్మల అప్పారావు, వైస్ ఎంపీపీ చెందాడ దేవి పాల్గొన్నారు.

6న రాష్ట్రస్థాయి సదస్సును జయప్రదం చేయాలి

ప్రజాశక్తి- మునగపాక రూరల్ : ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ స్కూల్ టీచర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 6న నెల్లూరు అంబేద్కర్ భవన్లో జరిగే రాష్ట్రస్థాయి సదస్సును జయప్రదం చేయాలని అసోసియేషన్ నాయకులు కోన లక్ష్మణ్ పిలుపునిచ్చారు. మండలంలోని నాగులపల్లి గ్రామంలో శుక్రవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఈ సమావేశానికి అతిథిగా మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి హాజరవుతారని తెలిపారు. రాష్ట్ర విద్యా వ్యవస్థలో 80 శాతానికి పైగా ఉన్న ప్రైవేటు విద్యాసంస్థల్లో పనిచేసే ఉపాధ్యాయుల పరిస్థితి అధ్వానంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. 12 నుండి 14 గంటల వరకు పనిచేస్తున్నారని, దానికి తగిన వేతనం చెల్లించకుండా యాజమాన్యాలు గొడ్డు చాకిరి చేయించుకుంటున్నాయని, 12 నెలలు పని చేయించుకుని పది నెలలకే జీతాలు ఇస్తున్నాయని తెలిపారు.

సిఎం సహాయ నిధి చెక్కు అందజేత

ప్రజాశక్తి- దేవరాపల్లి : మండలంలోని కెఎమ్.పాలెం గ్రామానికి చెందిన నెల్లూరి పుష్ప అనారోగ్య సమస్యతో ప్రైవేట్ ఆసుపత్రిలో వైద్య సేవలు పొందగా, అందు నిమిత్తం అయిన ఖర్చులకు సంబంధించి ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి మంజూరైన రూ.3 లక్షల చెక్కును ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు బాధిత కుటుంబానికి అందజేశారు. తారువలోని డిప్యూటీ సిఎం క్యాంపు కార్యాలయంలో శుక్రవారం జరిగిన ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రామకృష్ణ పాల్గొన్నారు.

మొక్కలకు జియో ట్యాగింగ్

ప్రజాశక్తి - కశింకోట : మండలంలోని జమ్మదులపాలెం గ్రామ సంఘంలో గ్రీన్ మిలీనియంలో భాగంగా ఇచ్చిన పండ్లు, కొబ్బరి మొక్కలకు జియో ట్యాగింగ్, పర్యవేక్షణ శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపిఎం ఎస్.శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రభుత్వం సరఫరా చేసిన మొక్కలు కాపాడుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బిసి రామకృష్ణ, విఒఎ కుమారి పాల్గొన్నారు.

నేడు ఉచిత కేన్సర్ నిర్ధారణ పరీక్షలు

ప్రజాశక్తి-అనకాపల్లి : స్థానిక గౌరీ గ్రంథాలయం ఆధ్వర్యంలో ఈ నెల 5న శనివారం ఉదయం 9 నుంచి 1 గంట వరకు ఉచితంగా కేన్సర్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించనున్నామని గ్రంథాలయ కార్యదర్శి కాండ్రేగుల వెంకటరమణ ఒక ప్రకటనలో తెలిపారు. హోమీ బాబా కేన్సర్ హాస్పటల్, పరిశోధనా కేంద్రం (అగనంపూడి) సహకారంతో రొమ్ము, గొంతు, తల, గర్భాశయం, నోరు మొదలగు పరీక్షలు ఉచితంగా జరుగుతాయని తెలిపారు. సదస్సుకు 30 ఏళ్ల పైబడిన వారు హాజరు కావచ్చన్నారు. వివరాలకు 92471 66511 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

దొంగ ఓట్లుపై దృష్టి పెట్టాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : గ్రామాలలో దొంగ ఓట్లుపై టీడీపీ శ్రేణులు దృష్టి సారించాలని మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ పిలుపునిచ్చారు. టిడిపి మండల విస్తృత స్థాయి సమావేశం శుక్రవారం తుమ్మపాల గౌరీ కళ్యాణ మండపంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్తుకు గ్యారెంటీ పథకాలపై ఇంటింటికి ప్రచారం చేయాలని కోరారు. నియోజకవర్గంలో 2450 ఓట్లు ఎటువంటి డోర్ నెంబర్ లేకుండా జీరో నెంబర్‌పై నమోదు అయ్యాయని పేర్కొన్నారు. సమగ్ర ఓటరు వెరిఫికేషన్ ప్రక్రియలో పాల్గొనాలని బిఎల్ఓలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు కొట్ని బాలాజీ, కొణతాల శ్రీనివాసరావు, పచ్చికూర రాము, కర్రి బాబి, నడిపల్లి గణేష్, సేనాపతి స్వరూప, తలారి కాశి నాయుడు, ఎంపిటిసీలు తోటాడ విజయ్, కడిమిశెట్టి గణేష్, ముప్పల రాము పాల్గొన్నారు.

రెండో రోజుకు ఎన్‌టిపిసి కాంట్రాక్టు కార్మికుల సమ్మె

ఎమ్మెల్యే అదీప్‌రాజ్ మద్దతు

ప్రజాశక్తి - పరవాడ

ఎన్‌టీపీసీ సింహాద్రిలో కాంట్రాక్ట్ కార్మికులకు డస్ట్ అలవెన్స్ అగ్రిమెంట్ చేయాలని, ఐడెంటి కార్డుపై ఎన్‌టిపిసి లోగో ఉండాలని, వైద్య పరీక్షల పేరుతో కార్మికులను వేధింపులకు గురి చేయడం ఆపాలని తదితర సమస్యలపై అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యాన కార్మికులు చేపట్టిన సమ్మె రెండో రోజు శుక్రవారం కూడా కొనసాగింది. ఈ సందర్భంగా కెవి.శ్రీనివాస్, గనిశెట్టి సత్యనారాయణ (సిఐటియు), ఎన్.రామచంద్రరావు, పెంటారెడ్డి (ఐఎన్‌టియుసి), ఎం.అప్పలనాయుడు (టిఎన్‌టియుసి), ఎంవి.నాయుడు, బి.రమణ మాట్లాడుతూ డస్ట అలవెన్స్ అగ్రిమెంట్ పూర్తయి రెండు సంవత్సరాలు కావస్తున్నా యాజమాన్యం మొండిగా నిర్లక్ష్యంగా బాధ్యతారహితంగా వ్యవహరించడం దుర్మార్గమన్నారు. సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సమ్మె శిబిరానికి స్థానిక ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ చేరుకొని మద్దతు ప్రకటించారు. యాజమాన్యం సమస్య పరిష్కరించే వరకు అండగా ఉంటానని కార్మికులకు ఆయన భరోసా ఇచ్చారు. ఆందోళనలో భాగంగా ఎన్‌టిపిసి మెయిన్ గేట్ నుండి పరిపాలన భవనం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పిపి నాయుడు, బంగారు బాబు, కోరెడ్డి అప్పలరాజు, ఎంపీపీ పైల వెంకట పద్మ లక్ష్మి శ్రీనివాసరావు, పెద్ద ఎత్తున కార్మికులు పాల్గొన్నారు. దీనిపై ఎన్‌టిపిసి యాజమాన్యాన్ని ప్రజాశక్తి సంప్రదించగా, కార్మికుల డిమాండ్లపై ఎన్టిపిసి యాజమాన్యం, ట్రేడ్ యూనియన్లకు మధ్య చర్చలు కొనసాగుతున్నాయని, త్వరలోనే పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.



ఆందోళన చేస్తున్న ఎన్‌టిపిసి కాంట్రాక్టు కార్మికులు

ఓటర్ల జాబితా పక్కాగా ఉండాలి : కలెక్టర్

ప్రజాశక్తి- అనకాపల్లి

ఇంటింటి సర్వే క్షుణ్ణంగా చేసి జిల్లాలో ఓటర్ల జాబితాను పక్కాగా రూపొందించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రవి పఠాన్‌శెట్టి ఎలక్టోరల్ రోల్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం ఓటర్ల జాబితాపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ చిన్న పొరపాటుకు కూడా అవకాశం ఇవ్వకుండా పారదర్శకంగా అర్హులైన అందరి పేర్లు జాబితాలో ఉండేలా జాగ్రత్త వహించాలన్నారు. ప్రతి మంగళవారం నియోజకవర్గ స్థాయిలో ప్రతి బుధవారం జిల్లా స్థాయిలో రాజకీయ పార్టీలతో జరిగే సమావేశంలో వివరాలను తెలియ జేయాలన్నారు. ఓటరును తొలగించే క్రమంలో స్పష్టమైన పరిశీలన, డాక్యుమెంటు, ఆధారాలు, ఫారం-7 తప్పక ఉండాలన్నారు. వందమంది ఓటర్లలో రెండుకు మించి తొలగింపులు ఉంటే ఏఆర్‌ఓ లేదా అడిషనల్ ఏఆర్‌ఓ పరిశీలించాలని సూచించారు. కొత్తగా చేర్చే ఓట్లు కూడా ఎక్కువగా ఉంటే క్షుణ్ణమైన తనిఖీ చేయాలన్నారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ స్మరణ్ రాజ్, డిఆర్వో పి.వెంకటరమణ, అనకాపల్లి నర్సీపట్నం ఆర్డీవోలు చిన్నికృష్ణ, జయరాం, ప్రత్యేక ఉపకలెక్టర్లు ప్రమీలగాంధీ, అనిత, జ్ఞాన వేణి, రామలక్ష్మి, తహశీల్దార్లు ఎంవి.రత్నం, భాగ్యవతి, తిరుమలబాబు, అన్నాజీరావు, ఏ సెక్షన్ సూపరింటెండెంట్ లక్ష్మీదేవి, డిటి రవికుమార్ పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటికి రెండో విడతలో ముగ్గురు ఎంపిక

ప్రజాశక్తి-అనకాపల్లి : రెండో విడత ట్రిపుల్ ఐటీ అనకాపల్లి మహాత్మ జ్యోతిబా పూలే గురుకుల పాఠశాలకు బండారు శివ చరణ్, కె. రాజా దుష్యంత్, ఎస్. స్వామి ఎంపికయ్యారు. మొదటి జాబితాలో ఏడుగురు విద్యార్థులు ఎంపిక కాగా, వీరితో పదిమంది విద్యార్థులు ట్రిబుల్ ఐటీ సీట్లు సాధించి గురుకుల పాఠశాల రికార్డు సృష్టించింది. ఈ సందర్భంగా గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు తల్లిదండ్రులు కమిటీ చైర్మన్ గంగాధర్, సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.





శివ చరణ్, రాజా దుష్యంత్, స్వామి

బేబీ చిత్ర యూనిట్ హంగామా

ప్రజాశక్తి -అనకాపల్లి : మాస్ మూవీ మేకర్స్ పతాకంపై యస్.కె.యన్ నిర్మాణ సారథ్యంలో సాయి రాజేష్ దర్శకత్వంలో ఆనంద్ దేవరకొండ, విరాజ్ అశ్విన్, వైష్ణవి చైతన్య ముఖ్య పాత్రధారులుగా రూపొందిన బేబీ చిత్రం అన్ని కేంద్రాల్లో హౌస్ ఫుల్ కలెక్షన్స్‌తో విజయవంతంగా ప్రదర్శించబడుతున్న సందర్భంగా శుక్రవారం అనకాపల్లి రాజా థియేటరుకు ఈ చిత్ర యూనిట్ ప్రేక్షకులను ప్రత్యక్షంగా కలుసుకోవడానికి విచ్చేశారు. వారికి ప్రేక్షకులు బ్రహ్మరథం పట్టారు. పూర్వి పిక్చర్స్ అధినేత వేగి శ్రీనివాసరావు, థియేటర్ ప్రొప్రయిటర్ తాటికొండ జీవం, తాటికొండ చిన కామేష్, మేనేజర్ ఆడారి ప్రభాకర్, ముప్పల అప్పారావు పాల్గొన్నారు.

ఘనంగా డాక్టర్ బొడ్డేడ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-అనకాపల్లి : సత్యదేవ్ హాస్పిటల్ ఎమ్‌డి డాక్టర్ బొడ్డేడ లక్ష్మీనరసింహారావు జన్మదిన వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. వైసిపి జిల్లా అధ్యక్షులు బొడ్డేడ ప్రసాద్, వైసిపి శ్రేణులు, వైద్య బృందం, స్నేహితులు, శ్రేయోభిలాషులందరూ వచ్చి డాక్టర్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. వైసిపి యువజన విభాగ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ యశ్వంత్ హాస్పిటల్ స్టాఫ్ సమక్షంలో కేక్ కటింగ్ చేయించారు. వైసిపి నాయకులు కాంగ్రేగుల మహాలక్ష్మి నాయుడు, కోరిబిల్లి హరి, వివి సత్య, శ్రీరాములు, కొణతాల మురళి, జాజుల రమేష్, కొణతాల భాస్కరరావు పాల్గొన్నారు.

వరుసలో వరినాట్లు వల్ల అధిక దిగుబడి

ప్రజాశక్తి-చోడవరం : వరి వరుసలలో నాటడం వలన అధిక దిగుబడి సాధించవచ్చని ఉత్తరాంధ్ర జిల్లాల ప్రకృతి వ్యవసాయ రీజినల్ కోఆర్డినేటర్ హేమ సుందర్ అన్నారు. శుక్రవారం మండలంలోని దామనాపల్లి గ్రామంలో ప్రకృతి వ్యవసాయం, వరి యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. వరి వరుసలలో నాటడం వలన అధిక దిగుబడులతో పాటు పురుగులు, దోమ ఉధృతిని తగ్గించుకోవచ్చని, రైతులకు పెట్టుబడి తగ్గుతుందని సూచించారు. కార్యక్రమంలో రైతులు నాగమణి, ఎల్ సన్నిబాబు పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన

ప్రజాశక్తి - బుచ్చయ్యపేట : బాల్య దశ నుండే వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కలిగి ఉండాలని తురకలపూడి పిహెచ్సి వైద్యాధికారి సంధ్యారాణి సూచించారు. ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని రాజాం గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి గ్రామంలో గల రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ 105 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఉచితంగా మందులను పంపిణీ చేశారు. పాఠశాల విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రత ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

పిఎసిఎస్ అధ్యక్షునిగా నాయుడు బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి-దేవరాపల్లి : ములకలపల్లి కో-ఆపరేటివ్ సొసైటీ నూతన అధ్యక్షులుగా నియమితులైన ఆర్‌వికె.నాయుడు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన్ను జెడ్పిటిసి కర్రి సత్యం, పలు గ్రామాల సర్పంచులు, ఎంపిటిసిలు, వైసిపి నాయకులు, పిఎసిఎస్ సిబ్బంది అభినందించారు. సొసైటీ త్రిసభ్య కమిటీ సభ్యులు మైచర్ల నారాయణరావు, వేదలకు సూరిబాబు, సర్పంచ్‌లు నీలిమ వెంకట్రావు, నాగిరెడ్డి సెటార్ నాయుడు, గొర్లె అన్నపూర్ణ, ఎంపిటిసి మజ్జిదేవి, వైసిపి నాయకులు గొర్లె కొండలరావు, మజ్జి రాజు, వి.చిన్నమ్మ నాయుడు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాల తొలగింపు

ప్రజాశక్తి-అనకాపల్లి : మండలంలోని తుమ్మపాల మేజర్ పంచాయతీ తుమ్మపాల వీధిలో అక్రమ కట్టడాలను శుక్రవారం గ్రామ సర్పంచ్ తట్ట పెంటయ్య నాయుడు, మాజీ సర్పంచ్ కర్రి బాబి ఆధ్వర్యంలో తొలగించారు. గ్రామపంచాయతీ తీర్మానాల ద్వారా అక్రమ కట్టడాలను తొలగించడం జరిగిందని సర్పంచ్ పేర్కొన్నారు. తుమ్మపాల వీధిలో వేణుగోపాలస్వామి గుడి దగ్గర నడిపల్లివారి దొడ్డిలో సిసి రోడ్లు, సీసీ డ్రైన్లు నిర్మాణం సందర్భంగా అక్రమ కట్టడాలను జెసిబి ద్వారా తొలగించారు. పంచాయతి కార్యదర్శి శ్రీనివాసరావు, ఎంపిటిసి పన్నీరు వెంకటలక్ష్మి చంటి, వార్డు మెంబర్లు రవ్వ శ్రీను, జర్రిపోతుల శ్రీలక్ష్మి, అండిబోయిన నాగరాజు, తర్రా సత్యారావు పాల్గొన్నారు.

83వ వార్డులో 'మహాశక్తి'

ప్రజాశక్తి- అనకాపల్లి : జీవిఎంసి 83వ వార్డు వేల్పుల వీధి రజకులపేటలో తెలుగు మహిళ నాయకులు శంకర్ల పద్మలత, కొణతాల రత్నకుమారి ఆధ్వర్యంలో మహాశక్తి కార్యక్రమం నిర్వహించారు. ఇందులో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ మాట్లాడుతూ మహాశక్తి పథకాలతో మహిళల జీవితాల్లో వెలుగులు నింపుతామని తెలిపారు. టిడిపి నాయకులు మళ్ళ సురేంద్ర, జోగినాయుడు, వేదుల సూర్య ప్రభ, కాయల ప్రసన్న లక్ష్మి, మేడిశెట్టి రాధ, కోట్ని ఉమ పాల్గొన్నారు.

వంట పాత్రల వితరణ

ప్రజాశక్తి- కశింకోట : మండలంలోని తాళ్లపాలెం హైస్కూల్‌కు శ్రీ సత్యసాయి బాబా భజన మండలి వారి ఆర్థిక సహాయంతో రెండు వంట పాత్రలను శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో భజన మండలి ప్రతినిధులు ముక్కామల వెంకట్రావు, హైస్కూల్ హెచ్‌ఎం విజయలక్ష్మి సుమన్, ఎమ్‌పిటిసి లగిశెట్టి భవానీ గణేష్, పాల సంఘం అధ్యక్షులు గుమ్మడి నారాయణరావు, చిన్ని భాస్కర్ రావు, భజన మండలి సభ్యులు పాల్గొన్నారు.

సైబర్ సెక్యూరిటీపై అవగాహన సదస్సు

ప్రజాశక్తి-అనకాపల్లి : స్థానిక డైట్ ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం కంప్యూటర్ సొసైటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో సైబర్ సెక్యూరిటీ వర్క్ షాప్ నిర్వహించారు. రెండు రోజుల పాటు జరిగే ఈ వర్క్షాప్‌కు రిసోర్స్ పర్సన్‌గా చిగురుపాటి కిరణ్ వ్యవహరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సైబర్ సెక్యూరిటీ నేర్చుకోవడం ద్వారా భద్రత ఉంటుందన్నారు. ఫిషింగ్ అటాక్ వంటి ఫ్రాడ్ యాప్‌ల వలన నెట్‌ఫ్లిక్స్ అకౌంట్ ఖాతా హ్యాక్ జరిగిందన్నారు. కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్ మాట్లాడుతూ ఇలాంటి నూతన కోర్సులు నేర్చుకొని అత్యుత్తమ ప్యాకేజీలతో మల్టీ నేషనల్ కంపెనీలలో ఉద్యోగాలు సాధించాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.వైకుంఠరావు, సిఎస్ఈ విభాగాధిపతి డాక్టర్ సుజాత, అకాడమిక్ కో-ఆర్డినేటర్ డాక్టర్ కె.పార్వతి మాట్లాడారు.

పది మందికి సేవతోనే సంతృప్తి

ప్రజాశక్తి-అనకాపల్లి : మనకున్న దానిలో పదిమందికి పంచుతూ సేవ చేయడంలోనే నిజమైన తృప్తి లభిస్తుందని ప్రముఖ బంగారు వర్తకులు, సప్తగిరి జువెలర్స్ అధినేత మళ్ల అప్పారావు అన్నారు. పట్టణంలోని తన షాపులో తన పుట్టినరోజును పురస్కరించుకొని అనకాపల్లి, మునగపాక మండలాలకు చెందిన సుమారు వందమంది నాయీ బ్రాహ్మణులకు పనిముట్లను ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయి బ్రాహ్మణ సంఘ నాయకులు పేలూరి సత్యనారాయణ, ఉమ్మలాడ ప్రసాద్ పాల్గొన్నారు.

ఎగ్గాడ నాగేశ్వరరావు 22వ వర్ధంతి

ప్రజాశక్తి-అనకాపల్లి : అణగారిన వర్గాల కోసం శ్రమించిన మహా నాయకుడు ఎగ్గాడ నాగేశ్వరరావు అని కాంగ్రెస్ అనకాపల్లి అసెంబ్లీ నియోజకవర్గ కోఆర్డినేషన్ కమిటీ సభ్యులు, న్యాయవాది ఐఆర్. గంగాధర్ అన్నారు. మండలంలోని వేట జంగాల పాలెం దళితవాడలో శుక్రవారం ఎగ్గాడ నాగేశ్వరరావు 22వ వర్ధంతి కార్యక్రమం ఘనంగా జరిగింది. ముందుగా ఎగ్గాడ నాగేశ్వరావు విగ్రహానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. కార్యక్రమంలో దళిత సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ ఎగ్గాడ భాస్కర్, కాంగ్రెస్ నాయకులు దాసరి సంతోష్, తుట్టా రమణ, బిఎస్‌పి నాయకులు సూదికొండ మాణిక్యాలరావు పాల్గొన్నారు.

మెడికల్ మాఫియాను అరికట్టాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : మెడికల్ మాఫియాను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే అరికట్టాలని ఏఐవైఎఫ్ డిమాండ్ చేసింది. స్థానిక సిపిఐ పార్టీ కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వేముల కన్నబాబు, వియ్యపురాజు మాట్లాడుతూ మెడికల్ మాఫియా హబ్‌గా ఆంధ్ర ప్రదేశ్ మారిందని, మెడికల్ మాఫియాను నియంత్రించడం లో ప్రభుత్వం పూర్తి విఫలమైందని విమర్శించారు. ప్రభుత్వాధికారులే లంచాలకు అలవాటు పడి మెడికల్ మాఫియాని పెంచి పోషిస్తున్నారని ఆరోపించారు. నిబంధనలకు విరుద్ధంగా రూ.200 టెస్టుకు రూ.2000 వసూలు చేయడం దారుణమన్నారు.

సంపూర్ణ పోషకాహార కిట్లు పంపిణీ

ప్రజాశక్తి- కశింకోట : కశింకోట పంచాయతీ కార్యాలయంలో ఐసిడిఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో సంపూర్ణ పోషకాహారం కిట్లును శుక్రవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి జిల్లా అధికార ప్రతినిధి మళ్ళ బుల్లిబాబు, సిడిపిఓ అధికారి ప్రభావతి, వైస్ ఎంపిపి పెంటకోట జ్యోతి, సర్పంచ్ మంత్రి జయరజని పాల్గొన్నారు. జె.తుని గ్రామంలో సర్పంచ్ కొన అరుణ, వైసిపి నాయకులు కొన నాగేశ్వరరావు, వైద్య అధికారి రమేష్, అచ్చర్ల గ్రామంలో సర్పంచ్ నిమ్మదల సోమేశ్వరరావు, సూపర్ వైజర్ సుచరిత, ఆదిలక్ష్మి, వైసిపి నాయకులు నిమ్మదల నాగేశ్వరరావు, అంగన్వాడీ కార్యకర్తలు కమల, నాగలక్ష్మి పాల్గొన్నారు. ఉగ్గినపాలెంలో ఎంపిపి కలగ లక్ష్మి పౌష్టికాహార కిట్లు పంపిణీ చేశారు. సర్పంచ్ కలగ గున్నయ్యనాయుడు, అంగన్వాడీ కార్యకర్తలు జి.రమణి, లక్ష్మి పాల్గొన్నారు సుందరయ్యపేటలో సర్పంచ్ బండారు వాసు, కార్యదర్శి సాయిగీత, పాఠశాల హెచ్‌ఎం మహాలక్ష్మి నాయుడు, అంగన్వాడీ కార్యకర్తలు నూకరత్నం, లక్ష్మి, కృష్ణవేణి పాల్గొన్నారు.

సబ్బవరం : వైయస్సార్ సంపూర్ణ పోషణ రేషన్ కిట్లు పంపిణీ కార్యక్రమాన్ని స్థానిక ఐసిడిఎస్ కార్యాలయంలో శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పి వైస్ చైర్మన్ తుంపాల అప్పారావు, ఎంపీపీ బోకం సూర్యకుమారి రామునాయుడు, ఎంపిడిఓ, వైస్ ఎంపీపీలు చొక్కాకుల గోవింద్, శరగడం రూప్సీ లక్ష్మి రాణి, కోటాన రాము, సబ్బవరపు ముత్యాలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

మట్టి నమూనాలతో అధిక ప్రయోజనాలు

ప్రజాశక్తి-కె.కోటపాడు : పంట పొలాలలో తీసిన మట్టి నమూనాలు ప్రతి రైతు తప్పనిసరిగా పరీక్షలు చేయించుకొని అధిక ప్రయోజనాలు పొందాలని జిల్లా వనరుల కేంద్రం అగ్రికల్చర్ ఏడి శ్రీధర్ సూచించారు. శుక్రవారం మండలంలోని వారాడ గ్రామంలో పొలంబడి నిర్వహించారు. రైతుల అవగాహన కోసం బ్యాలెట్ బాక్స్ టెస్ట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడి మాట్లాడుతూ వ్యవసాయంలో రైతులు అవలంభిస్తున్న యాజమాన్య పద్ధతులపై ఎంత మేరకు అవగాహన ఉన్నదో తెలియజేయడానికే ఈ బ్యాలెట్ బాక్స్ టెస్ట్ ప్రదర్శన అని పేర్కొన్నారు. పురుగు మందులు అధికంగా వాడటం వల్ల వాటి విష ప్రభావం శరీరంలో ఏయే భాగాలకు ఇబ్బందులు కలుగజేస్తాయో రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో అగ్రికల్చర్ అధికారులు తులసీమణి, చిరంజీవి, సోమశేఖర్, రైతులు పాల్గొన్నారు.

15న చిత్రలేఖన పోటీలు

ప్రజాశక్తి- అనకాపల్లి : ఈ నెల 15న స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని అనకాపల్లి ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో అనకాపల్లి పట్టణం, అనకాపల్లి, కసింకోట, మునగపాక మండలాల్లో ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు నిర్వహించనున్నట్లు అకాడమీ అధ్యక్ష కార్యదర్శులు తమ్మన సుబ్బారావు, కార్యదర్శి సిహెచ్ ఎస్ఎస్ రామచంద్రరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోటీల్లో పాల్గొనే విద్యార్థులు రంగులు, బ్రష్ లు, ఇతర అవసరమైన వస్తువులు వారే స్వయంగా తెచ్చుకోవాలని సూచించారు. బొమ్మలు వేసేందుకు డ్రాయింగ్ పేపర్ మాత్రం అకాడమీ వారు అందిస్తారన్నారు. ఈ పోటీలను గ్రూప్ ఏ విభాగంలో ఎల్‌కేజీ నుంచి రెండో తరగతి వరకు విద్యార్థులు వారికి ఇచ్చిన చిత్రానికి రంగులు వేయాలని, గ్రూప్ బిలో 3, 4, 5 తరగతుల వారు వారికి ఇష్టమైన చిత్రాలను వేయాలని, గ్రూప్ సిలో 6, 7, 8 తరగతుల వారు వినాయక చవితి సంబరాలు, గ్రూప్ డిలో 9, 10 తరగతుల విద్యార్థులు తుఫాన్ బీభత్సం అన్న అంశాలపై చిత్రాలు గీయాల్సి ఉంటుందని వెల్లడించారు. ఆగస్టు 15న సాయంత్రం ఐదు గంటలకు మళ్ళ జగన్నాథం కళ్యాణ మండపంలో విజేతలకు బహుమతుల ప్రదానం ఉంటుందని చెప్పారు.

ప్రజాశక్తి 7
శనివారం 5 ఆగస్టు 2023

పదవీకాలం పొడిగింపు

ప్రజాశక్తి -కొత్తకోట: ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలకు గతంలో ప్రభుత్వం నియమించిన త్రి మెన్ కమిటీ మరో ఆరు నెలలు పాటు పొడిగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో ఎన్నికైన పాలకవర్గం పదవీకాలం 2018 సంవత్సరం తో ముగిసింది. రావికమతం మండలంలో కొత్తకోట, మేడివాడ, చిన పాచిల, రావికమతం గ్రామాలలో సహకార సంఘాలు వున్నాయి. అప్పటి నుంచి ప్రభుత్వం ఒక చైర్మన్ ముగ్గురు డైరెక్టర్లతో కూడిన కమిటీని నియమించింది. తాజాగా వీరి పదవీకాలం ఈ ఏడాది జూలై 31 తో ముగిసింది. ప్రభుత్వం మరో ఆరు నెలలు పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ జారీచేసిన ఉత్తర్వుల కాపీని సహకార సంఘాల సీఈఓలకు అందించారు. పొడిగించిన పదవీకాలం 2024 జనవరి 31 వరకు ఉంటుందన్నారు.



మాట్లాడుతున్న ఎంపిడిఒ

ప్రతి ఒక్కరూ దేశభక్తి పెంపొందించుకోవాలి

ప్రజాశక్తి-కోటవురట్ల: ప్రతి ఒక్కరూ దేశభక్తి పెంపొందించుకొని అమరవీరులను గౌరవిం చాలని జిల్లా పరిషత్ సభ్యురాలు సిద్దాబత్తుల ఉమాదేవి కోరారు. శుక్రవారం మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీడీవో కాశీ విశ్వనాథరావు ఆధ్వర్యంలో సర్పంచ్, ఎంపీటీసీ సభ్యులతో జరిగిన ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ, ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా ఈనెల 9 నుంచి 15 వరకు నిర్వహించనున్న నా భూమి నా దేశం కార్యక్రమం విజయవంతం చేయాలన్నారు, ఎంపీడీవో కాశీ విశ్వనాథరావు మాట్లాడుతూ, ప్రతి గ్రామానికి 75 మొక్కలు చొప్పున అందజేయడం జరుగుతుందని వాటిని ఉపాధి హామీలో భాగంగా పెంపకం చేపట్టాలన్నారు. 14న వీరులకు వందనం, 15న జెండాకు వందనం కార్యక్రమం విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అప్పలనాయుడు, ఈఓపిఆర్‌డి సుబ్రహ్మణ్యం, ఏపీవో గంగు నాయుడు పాల్గొన్నారు.

నేడు సమావేశం

ప్రజాశక్తి-గొలుగొండ: హలో మాదిగ ఛలో హైదరాబాద్ మాదిగల విశ్వరూప మహాసభకు వెళ్లేందుకు సన్నాహక సభను ఈ నెల 5న గొలుగొండ మండలం చీడిగుమ్మల గ్రామంలో డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద ఏర్పాటు చేయడం జరిగిందని గొలుగొండ మండల నాయకులు కాపారపు సోంబాబు తెలిపారు. ఈ సమావేశంకు ముఖ్య అతిథిగా ఉత్తరాంధ్ర కోస్తా జిల్లాల కన్వీనర్ ముమ్మిడివరపు చిన సుబ్బారావు మాదిగ, తదితరులు హాజరవుతారని, నేతలు సకాలంలో హాజరు కావాలని కోరారు.

తల్లిపాలతో బిడ్డలకు ఆరోగ్యం



ర్యాలీ చేపడుతున్న సిబ్బంది, నాయకులు

ప్రజాశక్తి-గొలుగొండ: బిడ్డకు తల్లిపాలు ఎంతో శ్రేష్ఠమైనవని గొలుగొండ జెడ్పీటీసీ సుర్ల గిరిబాబు అన్నారు. చీడిగుమ్మల పంచాయతీలో తల్లి పాల వారోత్సవాల కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. జెడ్పీటీసీ మాట్లాడుతూ, పుట్టిన బిడ్డకు ఖచ్చితంగా తల్లిపాలు ఇవ్వాలన్నారు. తల్లిపాల ప్రాముఖ్యత, విశిష్టత తెలియసేందుకు వారం రోజుల పాటు వారోత్సవాలు నిర్వహించడం మంచి విషయమన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి లెక్కల అప్పలనాయుడు, వెలుగు ఏపిఎం మంగ, చీడిగుమ్మల ప్రభుత్వ ఆరోగ్య కేంద్రం డాక్టర్లు, అంగన్వాడీ కార్యకర్తలు ఆశ వర్కర్లు వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

దేవరాపల్లి: అప్పుడే పుట్టిన బిడ్డకు తల్లిపాలు అమృతంతో సమానమని, ప్రకృతి మనకు ఇచ్చిన పౌష్టికాహారం తల్లిపాలని ఎంపిపి కిలపర్తి రాజేశ్వరి అన్నారు. ఐసిడిఎస్ సిడిపిఓ మంగతాయారు ఆధ్వర్యంలో స్థానిక ద్రోణంరాజు కళ్యాణ మండపం ఆవరణలో వైయస్సార్ సంపూర్ణ పోషణ తల్లిపాల వారోత్సవాలు శుక్రవారం జరిగాయి. ఇందులో పాల్గొన్న రాజేశ్వరి గర్భిణులకు శ్రీమంతాలు చేసి, బాలింతలకు పౌష్టికాహార కిట్లులను అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ సబ్బవరపు పెంటమ్మ, ఎంపీడీవో సిహెచ్ సుబ్బలక్ష్మి, వైద్యాధికారిణి లలిత, అంగన్వాడి బోధకులు, సూపర్వైజర్లు పాల్గొన్నారు.

15 నుంచి బస్సు యాత్ర

ప్రజాశక్తి-గొలుగొండ: సిపిఐ బస్సు యాత్రను జయప్రదం చేయాలని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి మాకిరెడ్డి రామునాయుడు కోరారు. గొలుగొండ మండలం



మాట్లాడుతున్న రామునాయుడు

చీడిగుమ్మలలో మండల కార్యవర్గ సమావేశం కిల్లాడ అప్పలనాయుడు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా రామునాయుడు మాట్లాడుతూ, ఎన్నికల ముందు ఓటర్లను మాయ మాటలతో గద్దెకెక్కిన ప్రధాని నరేంద్ర మోడీ, రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌లు రాష్ట్ర సంపదను అమ్ముడం, తాకట్టు పెడుతున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం బ్యాంకులు, ఎల్‌ఐసి, బిఎస్ఎన్ ఎల్, రైల్వేలను ప్రైవేటీకరణకు పాల్పడు తున్నారు.సిపిఐ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో ఈనెల 15 తేదీ నుండి 27వ వరకు బస్సు యాత్ర ప్రారంభం కానుందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి మేకా భాస్కరరావు, కార్యవర్గ సభ్యులు మేకా సత్యనారాయణ, శెట్టి పైడియ్య పాల్గొన్నారు.

పాడిపశువులకు టీకాలు

ప్రజాశక్తి-రావికమతం: పాడిపశువుల టీకాలు వేయించాలని సర్పంచ్ గుమ్మాల శంకర్రావు కోరారు. మండలంలో గుడివాడ పంచాయతీ శివారు పిల్లవానిపాలెం గ్రామంలో శుక్రవారం పశువుల టీకా కార్యక్రమాన్ని సర్పంచ్ శంకర్రావు, చోడవరం పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ చిన్నం నాయుడులు ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, పాడి పశువులకు ముద్ద చర్మ వ్యాధి (లంపి స్కిన్) రాకుండా ఉచితంగా నివారణ టీకాలు వేయడం జరుగుతుందన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఉచిత పశు టీకా కార్యక్రమం రైతులకు ఎంతో మేలును కలిగిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో చోడవరం పశు సంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ చిన్నం నాయుడు మాట్లాడుతూ పశువులలో తీవ్ర జ్వరం, శరీరంపై వివిధ భాగాల్లో బొబ్బలు, ముక్కు నోటి నుండి స్రావాలు వంటి లక్షణాలతో పశువులు కనిపిస్తే సమీపంలో పశువైద్యశాల కు సమాచారం అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో తట్టబంద పశు వైద్యాధికారి నూకేశ్వరరావు , కొత్త కోట పశువైద్యాధికారి బాల తేజ , నాగేశ్వరరావు, వాసు, రైతులు పాల్గొన్నారు.



టీకాలు వేస్తున్న పశు వైద్యులు

నాన్ షెడ్యూల్ ఆదివాసీల పాదయాత్ర



పాదయాత్ర చేపడుతున్న నాయకులు

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్: నాన్ షెడ్యూల్ ఆదివాసీలు శుక్రవారం స్థానిక నర్సీపట్నం సబ్ కలెక్టర్ కార్యాలయం నుంచి మహా పాదయాత్రను ప్రారంభించారు. అఖిల భారత ఆదివాసి సంఘం ఆంధ్రప్రదేశ్ అధ్యక్షులు రేచుకట్ల సింహాచలం జెండా ఊపి పాదయాత్రను ప్రారంభించారు. ఈ పాదయాత్ర ఈనెల 7వ తేదీన అనకాపల్లి జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ముగిస్తుందని సింహాచలం తెలిపారు. ఆదివాసీల భూములను కాజేయడానికి అవినీతిపరులైన కొందరు రెవెన్యూ అధికారుల సహకారంతో స్వాహాకు పాల్పడుతున్నారన్నారు. చీడికాడ మండలం కోనం శివారు గ్రామమైన గుంటి కొండ దొర ఆదివాసీలు తరతరాలుగా సాగు చేస్తున్న ప్రభుత్వ బంజరు భూముల్లోకి వెళ్లవద్దని, ఈ భూముల పట్టాలు గిరిజనేతరులకు ఉన్నాయని, అధికారులు గిరిజనులను హెచ్చరించారన్నారు. అఖిలభారత వ్యవసాయ గ్రామీణ కార్మిక సంఘం జాతీయ కార్యదర్శి పిఎస్ అజయ్ కుమార్ ,, తదితరులు పాల్గొన్నారు.

రోలుగుంట: ఆదివాసీల సాగులో ఉన్న (ఆన్‌లైన్) భూమి రికార్డులను ఏకపక్షంగా మార్చేస్తున్నారని, ఈ విషయంపై రెవెన్యూ అధికారులు, కలెక్టర్ తగు చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆదివాసులు చేస్తున్న పాదయాత్ర రోలుగుంట చేరుకొంది. తహశీల్దార్ కె.వరహాలుకు వినతిపత్రం అందజేశారు. ఈ పాదయాత్ర బృందానికి ఆంధ్రప్రదేశ్ ఆదివాసీ గిరిజన సంఘం 5వ షెడ్యూల్డ్ సాధన కమిటీ జిల్లా గౌరవ అధ్యక్షులు కె.గోవిందరావు సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపి ఆదివాసుల హక్కుల సాధన సంఘం అధ్యక్షులు నల్లి కల్యాణం పాల్గొన్నారు.



కంప్యూటర్ ఇస్తున్న హెటిరో కంపెనీ ప్రతినిధులు

పాఠశాలకు కంప్యూటర్ వితరణ

ప్రజాశక్తి- నక్కపల్లి: మండలంలోని రాజయ్య పేట గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు హెటిరో కంపెనీ యాజమాన్యం కంప్యూటర్ సమకూర్చింది. ఈ మేరకు శుక్రవారం కంపెనీ ప్రతినిధులు సుబ్బారెడ్డి, రాజారెడ్డి చేతుల మీదుగా పాఠశాల హెచ్ఎం నారాయణరావుకు అందజే శారు. అనంతరం కంపెనీ ప్రతినిధులు మాట్లాడుతూ, కంపెనీ చైర్మన్ బండి పార్థసారథి రెడ్డి గ్రామాల్లో మౌలిక వసతులు కల్పనకు సహకారాలు అందించడం జరుగుతుందన్నారు. ఇప్పటికే అనేక సేవా కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. రాజయ్యపేట గ్రామస్తుల విజ్ఞప్తి మేరకు ఆర్ఓ ప్లాంట్ ఏర్పాటుకు, రోడ్ల నిర్మాణానికి సంబంధించి కంపెనీ ప్రతినిధులు గ్రామస్తులతో కలిసి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి సభ్యురాలు గోసల కాసులమ్మ పాల్గొన్నారు.

సరుకుల ధరలపై అదుపేదీ? : టిడిపి

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్: నిత్యవసర వస్తువుల ధరలు పెరుగుతున్నా సంబంధం లేని విధంగా రాష్ట్రంలో వైసిపి పాలన కొనసాగిస్తుందని నర్సీపట్నం టీడీపీ నాయకులు నేతల నాగేశ్వరరావు విమర్శించారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్నడూ లేని విధంగా నిత్యావసర వస్తువుల ధరలు భగ్గుమంటున్నాయన్నారు. ప్రజలు నిత్యం ఉపయోగించే నిత్యావసర వస్తువుల ధరలను అదుపు చేయలేని ప్రభుత్వానికి పాలించే అర్హత లేదన్నారు. కూరగాయలతో పాటు కందిపప్పు వంటి ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయన్నారు. వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో ఉపాధి అవకాశాలు లేక బతుకుతెరువు కోసం ఇతర రాష్ట్రాలకు వలసలు పోవాల్సిన పరిస్థితులు రాష్ట్రంలో ఉన్నాయని తెలిపారు. వైసిపి ప్రభుత్వానికి రానున్న ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని కోరారు.

విశాఖ వెళ్లి పింఛను అందజేత

ప్రజాశక్తి -కొత్తకోట: మానవత్వంతో విశాఖ వెళ్ళి పింఛన్ అందించిన వాలంటీర్ పై పలువురు ప్రశంసలు కురిపించారు. అనారోగ్యానికి గురై విశాఖ కెజిహెచ్‌లో చికిత్స పొందుతున్న వృద్దురాలు కు పింఛన్ అందజేసి పలువురి మన్ననలు పొందారు. రావికమతం మండలంలో కొత్తకోట గ్రామానికి చెందిన పింఛనుదారు ఇంటి కొండమ్మ ఇటీవల అనారోగ్యంతో బాధపడుతూ విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతుంది. వాలంటీరు దంట్ల ఉమేష్ చంద్ర కేజీహెచ్ కు వెళ్లి కొండమ్మ కు పింఛన్ను అందజేశారు. వాలంటీర్‌ను సర్పంచ్ కొన లోవరాజు, ఉపసర్పంచ్ పందల దేవ, ఎంపిటిసి పూడి దేవ అభినందించారు.



పింఛను ఇస్తున్న వాలంటీర్



చిత్రపటాలను ఇస్తున్న దాతలు

గ్రంథాలయానికి చిత్రపటాల బహూకరణ

ప్రజాశక్తి- నర్సీపట్నం టౌన్: స్థానిక ఐదు రోడ్ల జంక్షన్లో శాఖా గ్రంథాలయం అభివృద్ధికి సహకరించిన దాతలందరికీ లైబ్రేరియన్ దమయంతి ధన్యవాదాలు తెలియజేశారు. శుక్రవారం ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల హిందీ ఉపాధ్యాయురాలు మలిరెడ్డి రాఘవ కుమార్ తల్లిదండ్రుల దేశ నాయకులు, గ్రంథాలయ పితామహుల చిత్రపటాలు బహుకరించారని తెలిపారు. నాతవరం మండలం ఎర్రవరం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల సైన్స్ ఉపాధ్యాయులు చుక్కల రామ, తదితరులు మరుగుదొడ్డు మరమ్మత్తులు చేయించారని, మరికొంత మంది బిల్డింగ్ రంగులు నిమిత్తం సహకరించారని అన్నారు.

వరి నాట్లపై అవగాహన

ప్రజాశక్తి -నక్కపల్లి: రైతులు తాడు ఉడుపు ద్వారా వరి నాట్లు వేసుకోవాలని వ్యవసాయ అధికారి ఉమా ప్రసాద్ సూచించారు. మండలంలోని డొంకాడ, గొడిచెర్ల గ్రామాల్లో శుక్రవారం వరి సాగు పై రైతులకు అవగాహన కల్పించారు. తాడు ఉడుపు ద్వారా వరి నాట్లు వేసుకోవడంతో గాలి, వెలుతురు బాగా తగిలి వరి దుబ్బు బాగా వస్తుందని తెలిపారు. అంతేకాకుండా దోమ నివారించడానికి, పొలంలో వివిధ పనులు చేసేందుకు, పురుగుమందుల యాజమాన్యానికి సులభతరంగా ఉంటుందన్నారు. భాస్వరం ఎరువును దమ్ములోనే వేయాలని సూచించారు. ఈ సీజన్‌కు సంబంధించి 600 మెట్రిక్ టన్నుల అవసరం కాగా , ఇప్పటి వరకు ప్రస్తుతానికి వివిధ ఆర్ బి కే లలో 190 మెట్రిక్ టన్నులు ఎరువులు అందుబాటులో ఉంచడం జరిగిందన్నారు. యూరియా 130 మెట్రిక్ టన్నులు , డిఏపి 30 మెట్రిక్ టన్నులు, ఎంఒ పి 30 మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉంచడం జరిగిందన్నారు. సమతుల్యమైన ఎరువుల మోతాదుతో నత్రజని 32కేజీలు, భాస్వరం 24కేజీలు, పొటాష్ 16కేజీలు ఎకరా వరికి ఉపయోగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌బికే సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ అధికారి



వినతిపత్రం అందజేస్తున్న గోవిందరావు, ఆదివాసీలు

సాగు పట్టాలివ్వాలని సిపిఎం వినతి

ప్రజాశక్తి-రోలుగుంట:మండలంలో అర్ల పంచాయతీ శివారు పిత్రిగడ్డ గ్రామంలో ఎనిమిది కుటుంబాలు 30 సంవత్సరాల నుండి ప్రభుత్వ భూమిలో సాగు చేస్తున్నారని, వారికి పట్టాలు పంపిణీ చేయాలని సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు కె.గోవిందరావు శుక్రవారం తహశీల్దార్ కె.వరహాలు కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గోవిందరావు మాట్లాడుతూ, సాగుదారులు జీడిమామిడి తోటలు పెంచుకున్నారని, ప్రభుత్వం వ్యవసాయానికి ప్రకటించిన రాయితీలు అందలేదన్నారు. సర్వే నిర్వహించి వారికి పట్టాలు పంపిణీ చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పిత్రిగెడ్డ ఆదివాసులు పాల్గొన్నారు.

దీక్ష విరమించేది లేదు

ప్రజాశక్తి -కోటవురట్ల:అణుకు గిరిజన గ్రామానికి రహదారి సౌకర్యం కల్పించే వరకు దీక్ష దీక్ష విరమించేది లేదని సిపిఎం నేత అప్పలరాజు తేల్చి చెప్పారు. శుక్రవారం దీక్ష 29వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అనుకు గ్రామానికి కనీస వసతులు లేక అవస్థలు పడుతున్నారన్నారు. ఈ సందర్భంగా తంగేడు గ్రామానికి చెందిన పలువురు యువకులు సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో డేవిడ్ రాజు, సూరిబాబు, రమేష్ పాల్గొన్నారు.



కిట్లు ఇస్తున్న సర్పంచ్‌లు

వైఎస్ఆర్ పోషణ కిట్లు పంపిణీ

ప్రజాశక్తి -కొత్తకోట:పుట్టిన బిడ్డకు గంటలోపు తల్లిపాలు ఇవ్వడంతో వ్యాధినిరోధక శక్తీ పెరగడంతో పాటు, మొదటి టీకాగా ఉపయోగ పడుతుందని దొండపూడి, మత్సవానిపాలెం సర్పంచ్‌లు ఎం.గణేష్, జి.రాజారావు అన్నారు. ఈ గ్రామాలలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, అంగన్వాడీ కార్యకర్తలు తల్లిపాల ప్రాముఖ్యతను వివరించారు.ఆనంతరం గర్భిణీలకు, బాలిం తలకు సంపూర్ణ పోషణ కిట్లను పంపిణీ చేసారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ తాతబాబు, సచివాలయ కన్వీనర్ జి.నాగేశ్వరరావు, గృహసారధి రమేష్, వైసీపీ నాయకులు సోమిరెడ్డి శివ, బూరపు గోవింద్,అంగన్వాడీ కార్యకర్తలు దీప, రవణమ్మ, రత్నం, లక్ష్మి, లక్ష్మి పాల్గొన్నారు.

బహుమతుల ప్రదానం

ప్రజాశక్తి-మాడుగుల: ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు కృషి మేరకు కొద్ది కాలం కిందట మాడుగులలో ఏర్పాటు చేసిన మహిళా చేయూత మార్ట్‌లో కొనుగోలు దారులకు శుక్రవారం బహుమతులు అందించారు.మార్ట్ ఏర్పాటు అయిన తరువాత ఒకేరోజు లక్ష రూపాయలు సైతం అమ్మకాలు జరుగుతున్నాయని ఏరియా కో ఆర్డినేటర్ రత్న ప్రభ తెలిపారు. ఒకే రోజు వేయి రూపాయలు కొనుగోలు చేసిన మహిళలకు బహుమతులను సర్పంచ్ కళావతి, సచివాలయం మండల కన్వీనర్ శ్రీనివాసరావు చేతుల మీదుగా బహుమతుల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వెలుగు అప్పల నరసింహా, సిసి దంగేటి ప్రసాద్, సిబ్బంది సోమేశ్ కుమార్, సత్యవతి, లక్ష్మి, శ్రీను, వార్డ్ సభ్యులు హేమంత్ తదితరులు పాల్గొన్నారు,



బహుమతులు ఇస్తున్న సర్పంచ్

వారం రోజుల్లో రోడ్డు మరమ్మతు పనులు

-అధికారుల హామీ - ఆందోళన విరమించించిన సిపిఎం నేతలు

ప్రజాశక్తి-యస్.రాయవరం:మండలంలోని అడ్డురోడ్డు నుంచి నర్సీపట్నం వెళ్లే ప్రధానమైన రహదారిని వారం రోజుల్లో మరమ్మత్తులు చేపడతామని ఆర్అండ్‌బి అధికారులు హామీ ఇవ్వడంతో సిపిఎం నేతలు ఆందోళన విరమించారు. శుక్రవారం ఉదయం నర్సీపట్నం వెళ్ళే రహదారిని అడ్డురోడ్డు వద్ద సిపిఎం నాయకులు నిర్భంధించారు. అడ్డురోడ్డు నుండి నర్సీపట్నం వెళ్ళే రోడ్డు రామచంద్రాపురం వరకు పెద్ద పెద్ద గోతులు పడిపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సిపిఎం నేతలు తెలిపారు.ఈ ఆందోళనకు స్పందించిన అధికారులు సిపిఎం నాయకులతో మాట్లాడి వారం రోజుల్లో రోడ్డు మరమ్మతులు చేపడతామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.అప్పలరాజు మాట్లాడుతూ, ఇప్పటికే అనేక పర్యాయాలు అధికారులు హామీలు ఇవ్వడం జరిగిందని, అయినా చేపట్టలేదన్నారు. ఇప్పటికైనా అధికారులు రోడ్డు మరమ్మత్తులు చేపట్టకపోతే ప్రజల సహకారంతో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు.సర్కిల్ ఇన్స్పెక్టర్ డి.అప్పన్న, కోటవురట్ల ఎస్ఐ నారాయణరావు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్అండ్‌బి అధికారి సింహాద్రి రాజు, సిపిఎం మండల కన్వీనర్ ఎం.సత్యనారాయణ, జీ.డేవిడ్ రాజు, బి.రాము, ఎం.సూరిబాబు, రాజుబాబు, రమేష్ పాల్గొన్నారు.



సిపిఎం నేతలతో మాట్లాడుతున్న అధికారులు, పోలీసులు

వైభవ్ జ్యూయలర్స్‌కు అరుదైన గుర్తింపు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ :

వైభవ్ జ్యూయలర్స్ ఖాతాలో మరో అరుదైన గుర్తింపు వచ్చి చేరింది. విపుల్ షా అధ్యక్షతన రత్నాలు, ఆభరణాల ఎగుమతి ప్రమోషన్ కౌన్సిల్ (జిజెఇపిసి) ఈ నెల 3న ముంబయిలో జరిగిన ఐఐజెఎస్ ప్రీమియర్ షో సందర్భంగా ఇండస్ట్రీ లెజెండ్ అవార్డులతో భారతదేశంలోని 20 మంది రిటైలర్లను ఆభరణాల పరిశ్రమలో వారి వృద్ధి, విజయాలను గుర్తించి సత్కరించింది. అందులో విశాఖపట్నానికి చెందిన వైభవ్ జ్యూయలర్స్ సిఎమ్‌డి గ్రంధి భారతి మల్లికా రత్న కుమారి ఉన్నారు. పరిశ్రమ వృద్ధికి ఆమె చేసిన అపారమైన సహకారాన్ని అభినందిస్తూ జిజెఇపిసి ఆమెను ఇండస్ట్రీ లెజెండ్ అవార్డుతో సత్కరించింది. ఈ విషయాన్ని సంస్థ జనరల్ మేనేజర్ రఘునాధ్ శుక్రవారం ఒక ప్రకటనలో వెల్లడించారు.





ఇండస్ట్రీ లెజెండ్ అవార్డుతో వైభవ్ జ్యూయలర్స్ సిఎమ్‌డి గ్రంధి భారతి మల్లికా రత్న కుమారి

మూడేళ్లుగా..సాగని చేపల వేట

- నష్టపోతున్న మత్స్యకారులు

ప్రజాశక్తి-రోలుగుంట:మూడేళ్లుగా సంపూర్ణంగా చేపల వేట లేక మత్స్యకారులు నష్టపోతున్నారు. మండలంలో కొమరవోలు ఆవతో పాటు కల్యాణపులోవ, మరికొన్ని చెరువులలో 200 మంది మత్స్యకారులు వేటను సాగిస్తుంటారు. ఈ మండలానికి చెందిన కొమరవోలు ఫిషర్‌మెన్ సొసైటీకి చెందిన మత్స్యకారులు జీవనం సాగించేవారు. మూడేళ్లుగా ఈ కొమరవోలు ఆలో నీరు రైతులు రెండవ పంటకు వినియోగించ లేదు.. దీంతో, నీటి ప్రవాహం తగ్గలేదు. దీంతో, చేపలు పట్టేందుకు అనుకూలంగా లేదు. ఈ కారణంగా, చేపల వేట జరగ లేదు. నీరు తగ్గితే మార్చి, ఏప్రిల్ తేదీ వరకూ సంపూర్ణంగా చేపల వేట జరిగేది. దీనిపై ఆధారపడి ఉన్న 200 కుటుంబాల వారు జీవనం సాగించేవారు. ఈ మూడేళ్ల నుండి జనవరి, ఫిబ్రవరి మాసాలలో మిగతా చెరువులో వేటాడేవారు. గతంలో కల్యాణపులోవలో కూడా వేటాడేవారు. కల్యాణపులోవలో స్థానికులైన షెడ్యూల్ తెగల వారు కోర్టుకు వెళ్లడంతో దానిలో వేట నిలిపివేశారు. ఆ కారణంగా రెండు విధాలా నష్ట పోయారు. ఉన్న కొమరవోలు ఆవ నీరు పూర్తిగా ఉండటంతో వేట జరగలేదు. ఇలా మూడేళ్ల నుండి కొమరవోలు ఫిషర్‌మెన్ సొసైటీకి చెందిన రోలుగుంట, కంచుగుమ్మల, కొమరవోలు గ్రామాలకు చెందిన గూళ్ల జాతి (మత్స్యకారులు) వారు ప్రభుత్వానికి లీజు చెల్లింపుల్లో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రతీ ఏడాది చేప పిల్లలు 2లక్షల రూపాయలు విలువ చేసే పిల్లలను ఆగస్టు నెలలో వేస్తారు. దీంతో వారు నష్టపోతున్నారు. జిల్లా అధికారులు స్పందించి వారికి న్యాయం చేయాలని కోరుతున్నారు.





ఆవలో మత్స్యకారులు

కష్టంగా కుటుంబ పోషణ

మూడేళ్లుగా చేపల వేట పూర్తిగా లేదు. దీనిపై ఆధారపడే జీవిస్తున్నాం. దోనెలపై వలతో వేలాడుతుండటం, చిన్నాచితక పరిగెల, చవడ, బొచ్చులు అప్పుడప్పుడు వలలో పడతాయి. ఒక్కొక్క రోజు పడకపోయినా తరచూ ఉదయం, సాయంత్రం వేటకు వస్తాం. తండ్రితో వేటకు అలవాటై కుటుంబాన్ని పోషించుకుంటున్నాను.



గంతాది నూకరాజు,

ఏం చేయాలో తెలియలేదు

గత మూడేళ్లుగా జీవనం సాగటం లేదు. మా గ్రామంలో గూళ్లజాతికి చెందిన వారు 60 కుటుంబాల వారు ఉన్నారు. కొందరు చదువుకొని పెద్ద చదువులు చదివినా బెంగులూరు, చెన్నై, హైదరాబాద్‌లో హోటళ్లలో పని చేస్తున్నారు. మా జాతి కేటగిరి బిసి ఎ. ఏ ఉద్యోగాలు లేవు. ఏమి చేయాలో తోచక ఇబ్బందులు పడుతున్నాను.



గలకట్ల అనిల్‌కుమార్